
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

****



నల్లగొండ

5

ఆదివారం 12 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 । కనిష్ఠం 16.0

బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది

\- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బీజేపీ కులమతాల విభజనకు పాల్పడుతూ చిచ్చు పెడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంలో ఆనాడే ఆదివాసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 46 నిబంధనను తీసుకువచ్చిందన్నారు. ఆదివాసీలను తీర్చిదిద్దే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అలాగే గుజరాత్ నుంచి మణిపూర్ వరకు రాహుల్‌గాంధీ చేసిన భారత్ జోడోయాత్ర ఎందరో అభాగ్యులకు గొంతుకగా నిలిచిందన్నారు. దేశంలో 11 రాష్ట్రాల్లో 20వేల మంది ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం

- మిగతా 6వ పేజీలో...

సబ్‌ప్లాన్ చట్టం సర్వరోగ నివారిణి



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, చిత్రంలో రోడ్లు, భవనాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- ఆదివాసీలకు ప్రకృతే దైవం, దేహం
- కాంగ్రెస్ శ్రేణులు ధైర్యంగా సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నాగార్జునసాగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సర్వరోగ నివారిణి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రాజెక్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్న అఖిలభారత గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల సాధికారత శిక్షణ తరగతుల ముగింపు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలను అందజేసే కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏలను పునరుద్ధరించడం, వాటికి బడ్జెట్‌ను కేటాయించి, నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామాల్లో ధైర్యంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. దేశ సంపద ప్రజలకు దామాషా ప్రకారం అందాలి తప్ప కార్పొరేట్ శక్తులకు కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీన పరచాలని చూస్తుంటే కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని రక్షించేందుకు నడుంబిగించారని అన్నారు. సంవిధాన్ సమ్మేళన్ పేరిట ఆయన దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పీసా చట్టాన్ని నూరుశాతం అమలుచేస్తామన్నారు. ఆదివాసీలు భూమిని తల్లిగా, నదులను రక్తమాంసాలుగా భావిస్తారని, వాటిని దూరం చేస్తే వారు ప్రాణం లేని శవాలుగా మారుతారన్నారు. ఆదివాసీలపై ప్రేమలేని వారు వారి నుంచి వాటిని

- మిగతా 6వ పేజీలో..

తండాలతో నాకు ఎక్కువ అనుబంధం

\- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



తండాలతో తనకు ఎక్కువ అనుబంధం ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వరకు సామాజిక న్యాయం ఒక్కటే కాంగ్రెస్ ఎజెండా అన్నారు. దళితులు, బీసీలు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందిస్తామన్నారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి వెంకట్‌రెడ్డి సహకారంతో ప్రతి తండాలో ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి భవనాలను నిర్మిస్తామన్నారు. అణగారిన వర్గాలను అభివృద్ధి చేయాలన్నదే రాహుల్‌గాంధీ ఉద్దేశమన్నారు. అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని జోస్యం చెప్పారు. దేశంలో ఎక్కడాలేని..

- మిగతా 6వ పేజీలో...

డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్


- నేటి కేటీఆర్ మహాధర్నా వాయిదా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు

నల్లగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శనివారం జిల్లాకేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుభరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి, రూ.12వేలకు తగ్గించారని, రుణమాఫీ సగం మంది రైతులకు మాత్రమే చేశారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై ఈ నెల 12న కేటీఆర్ అధ్యక్షతన తలపెట్టిన రైతు మహాధర్నాను సంక్రాంతి పండుగ, రహదారుల రద్దీ దృష్ట్యా వాయిదా వేశామని, పండుగ తర్వాత ఈ మహాధర్నాను యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేటీఆర్‌పై ఈ-ఫార్ములా పేరుతో కేసులు పెట్టారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యేలను భయభ్రాంతులకు గురిచేసి కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి జైలుకు పోయారు కాబట్టే, కేటీఆర్‌ను జైలుకు పంపాలన్నా కుట్రతో కేసులు పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, నాయకులు నిరంజన్ వలీ, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సింగం రాంమోహన్, కరీంపాషా, భువనగిరి దేవేందర్, అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సామాన్యులపై ధరాఘాతం



సంక్రాంతి పండుగ పూట కడుపు నిండా తినేపరిస్థితి లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు పండగను సంతోషంగా జరుపుకుందామంటే పెరిగిన నిత్యావసర ధరలతో బెంబెలెత్తిపోతున్నారు. ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ చేయక పోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని వస్తువులనైతే బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. దీంతో వ్యాపారులు చెప్పిందే రేటు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. హోల్ సేల్ రిటైల్ అనే తేడా లేకుండా ప్రతి వస్తువుపైనా అధిక ధరలు వసూలు చేస్తున్నారు. సామాన్యుడు ఇది ఏమిటని అడిగే పరిస్థితి కానరావడం లేదు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ, సూర్యాపేట టౌన్)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో మండిపోతున్న ధరలను చూసి సామాన్యులు విలవిల లాడుతున్నారు. కూరగాయల ధరలను పరిశీలిస్తే చిక్కుడు కాయ, బెండకాయ కిలోకు రూ.100కు చేరుకోగా, దొండ కాయ, గోకరకాయ కిలోకు రూ.80 వెచ్చించాల్సి వస్తుంది. ఇక మునగకాయ అయితే కిలోకు రూ.160చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఎల్లిగడ్డ కిలో రూ.300, ఎండుమిర్చి కిలో రూ.170, కందిపప్పు కిలో రూ.150 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో బెల్లం నిల్వలు సరిపడా లేవు. బెల్లం ధర ప్రస్తుతానికి నిలకడగానే ఉంది.

- ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదు!
- సంక్రాంతివేళ ఆకాశాన్నంటిన ధరలు
- మండిపోతున్న కూరగాయలు, నిత్యావసర సరుకులు
- ధరలపై ప్రభుత్వ నియంత్రణ కరువు

ఇతర ప్రాంతాల నుంచి సరుకుల దిగుమతితో..



ఇతర రాష్ట్రాలు, పక్క జిల్లాల నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు కూడా వస్తువులపై పడుతున్నట్లు సమాచారం. కూరగాయలు కర్నూల్, అనంతపురంతోపాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి వస్తుండగా నిత్యావసర వస్తువులు మాత్రం గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చేరుస్తారు. రాష్ట్ర రాజధాని సరిహద్దులో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కూరగాయల సాగు చేపట్టి ధరలు నియంత్రిస్తామని గత ప్రభుత్వం స్పష్టం చేసి ఉద్యానశాఖను అప్రమత్తం చేసింది. అయితే గత ప్రభుత్వ..

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వంనుంచి అదనపు రేషన్ లేనట్లే..

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు తొమ్మిది రకాల సరుకులతో కూడిన నిత్యావసర వస్తువులు, రేషన్ ఇచ్చే వారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ 11ఏళ్ల కాలంలో ప్రతినెలా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న సబ్సిడీ దొడ్డు బియ్యాన్ని సరఫరా చేయడం తప్ప ఎలాంటి అదనపు సరుకులు ఇవ్వడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో బెల్లం, చింతపండు, పప్పు, నూనె, గోధుమపిండి, చక్కెర, ఇంకా ఇతర మరో మూడు సరుకులను ఇచ్చేవారు. ప్రస్తుతం బియ్యం తప్ప అది కూడా ఒక్కో మనిషికి ఆరుకిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. సంక్రాంతి నుంచి రేషన్ షాపుల నుంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామన్నా ప్రభుత్వం మరోసారి వాయిదావేసింది. కనీసం పేద, మధ్యతరగతి ప్రజలు తెల్లరేషన్‌కార్డు ద్వారా పొందే బియ్యాన్ని కూడా అధికంగా ఇవ్వని పరిస్థితులున్నాయి. సంక్రాంతి నుంచి సన్నబియ్యం వస్తాయని ప్రజలు ఎంతో ఆశపడినప్పటికీ మరోసారి నిరాశ, నిస్పృహలు తప్పలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రతి నెలా 13 నుంచి 14వేల క్వింటాళ్లకు పైగా దొడ్డు బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. చాలా చోట్ల రేషన్ షాపు డీలర్లు తమ షాపుల్లో వ్యాపారుల నుంచి కొనుగోలు చేసుకొని వచ్చిన కొన్ని నిత్యావసర వస్తువులను మార్కెట్‌లో ఉన్న రేట్లకే విక్రయిస్తుంటారు. ముఖ్యంగా నూనెతోపాటు గోధుమపిండి, సబ్బులను విక్రయిస్తున్నారు. వాస్తవానికయితే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిత్యావసర సరుకులు రేషన్ షాపునుంచి రాకపోవడంతో కొనుగోలు చేయక తప్పడంలేదు.

పథకాల అమలుకు సంసిద్ధం కావాలి



కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు అధికారులు సంసిద్ధం కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం కలెక్టర్‌లో నూతన పథకాల సంసిద్ధత, కార్యాచరణ ప్రణాళిక, పథకం ముఖ్య ఉద్దేశాలు, విధివిధానాలు, తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులతో హైదరాబాద్‌లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఆయా పథకాల అమలుపై నిర్దేశించిన ఆదేశాలను కలెక్టర్ అధికారులకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న పథకాల్లో రైతు భరోసా కింద వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే ప్రతీ సంవత్సరం ఎకరాకు రూ.12వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా విడతకు రూ.6వేల చొప్పున సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్నారు. గ్రామ, మునిసిపల్, పట్టణస్థాయిలో నూతన రేషన్ కార్డులు ఇస్తామన్నారు. గ్రామీణస్థాయిలో ఎంపీడీవోలు, పట్టణస్థాయిలో మునిసిపల్ కమిషనర్లకు ఈ బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. వన్ స్టేట్ వన్ రేషన్‌కార్డు పద్ధతిలో వీటిని పంపిణీ చేయనున్నట్లు వివరించారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక రేషన్ కార్డులో మాత్రమే ఉండేలా ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇంటి నిర్మాణానికి స్థలం ఉండి ఇల్లు లేని వారు, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు, అద్దె ఇళ్లలో నివాసం ఉండేవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో వితంతువులు, భూమి లేని వ్యవసాయ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ పథకాల అమలుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధ్యక్షతన ఈ నెల 12న ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారులతో ఉదయాదిత్య భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జేడీ శ్రవణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మునుగోడులో..

8

నేతన్నల భద్రత, భరోసా పథకాలను వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫ్లెక్సీలకు శనివారం జిల్లావ్యాప్తంగా క్షీరాభిషేకం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా పనులు చేపట్టాలి

పుట్టంగండి పంప్‌హౌస్‌ను పరిశీలించిన జలమండలి అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటి సమస్య లేకుండా పుట్టంగండి మరమ్మతు పనులు చేపట్టాలని జలమండలి అధికారులు సూచించారు. పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పుట్టంగండి పంప్‌హౌస్, సిస్టర్న్, హెడ్‌రెగ్యులేటర్, లింక్‌కెనాల్, ఏకేబీఆర్, కోదండపురం వాటర్‌ప్లాంట్‌ను శనివారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ తన బృందంతో కలిసి పరిశీలించారు. ముందుగా పుట్టంగండి పంప్‌హౌస్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌కు వచ్చే 9.26 కిలోమీటర్ల లింక్‌కెనాల్ శాశ్వత లైనింగ్ పనులు చేపడితే జంటనగరాలకు, మిషన్‌భగీరథకు తాగునీటి సమస్య ఏర్పడుతుందా? అనే అంశాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. పుట్టంగండి పంప్‌హౌస్ మోటర్లు బంద్ చేస్తే జంటనగరాలకు నీటి సమస్య ఏర్పకుండా పైప్‌లైన్ ద్వారా అక్కంపల్లి రిజర్వాయర్ నీటి తరలింపు, రైతులనుంచి ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట జలమండలి డైరెక్టర్ సుదర్శన్, ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రయ్.. రయ్..




కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

ఒక్కొక్కటి.. వందలాదిగా.. వేలాదిగా మారి రయ్.. రయ్..మంటూ పరుగులు పెట్టాయి. సంక్రాంతి పండుగకు సెలవులు ప్రకటించడంతో పట్టణం పల్లెకు పయనమైంది. పిల్లాపాపలతో సొంత వాహనాలు, బస్సుల్లో బయలుదేరిన ప్రయాణికులతో జిల్లాలోని జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర రహదారులు రద్దీగా మారాయి. వాహనాల రాకతో టోల్‌ప్లాజాల సందడిగా మారాయి.

6

రెండోరోజూ కొనసాగిన వాహనాల రద్దీ

సంక్రాంతి పండుగకు వారాంతపు సెలవులు కలిసిరావడంతో శనివారం సైతం హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. సోమ, మంగళ వారాల్లో సంక్రాంతి పండగ ఉండడంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఐటీ సంస్థల్లో పనిచేసే వారికి వరుస సెలవులు వచ్చాయి. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో వాహనాలు జాతీయ రహదారులపై చీమలదండును తలపించాయి. ఒకదాని వెంట ఒకటి రహదారిని పూర్తిగా ఆక్రమించి ముందుకు కదిలాయి. ఎటువంటి అవాంతరాలు రాకుండా ప్రతీ జంక్షన్, ఇతర ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు.



చౌటుప్పల్‌లో బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, కోదాడరూరల్, మునగాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పం డుగకు స్వగ్రామాలకు వెళ్తున్న ప్రజలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రెండో రోజూ రద్దీ నెలకొంది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో విజయవాడ వైపు ఐదు వరుసల్లో వాహనాల్లో దూసుకెళ్లాయి. వాహనాలు ఒకదానికొకటి తాకుతూ వెళ్లడంతో కొన్నిచోట్ల వాగ్వాదాలు చోటుచేసుకోవడం కనిపించింది. తుప్రాన్‌పేట, ఖైరతాపురం గ్రామాల సమీపంలో ట్రాఫిక్‌జాం ఏర్పడి వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. రెండు నిమిషాలకు దూరానికి 15నిమిషాలు పట్టిందని వాహనదారులు తెలిపారు. తుప్రాన్‌పేట వద్ద రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ప్రమాదాలు జరుగకుండా అన్నిరకాల ముందస్తు జాగ్రత్తలను తీసుకున్నట్లు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి, సీఐలు మన్మథకుమార్, విజయ్‌మోహన్ తెలిపారు.

● కోదాడ మండలం కొమరబండ జంక్షన్, కట్టకొమ్ముగూడెం, దుర్గాపురం, చిమిర్యాల క్రాస్‌రోడ్డు, రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల రద్దీ కనిపించింది. పోలీసులు దగ్గరుండి రోడ్డు దాటించారు. ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

పాలేరు బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు

గత ఏడాది వరదల కారణంగా పాలేరు బ్రిడ్జికి పడిన గండిని నేషనల్ హైవే అధికారులు పూర్తిచేయించారు. దీంతో శుక్రవారం రాత్రి నుంచే ఈ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పనులను పండుగ నాటికి పూర్తి చేయడంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగాయి.

జాతీయ రహదారిపై నాలుగుచోట్ల ప్రమాదాలు

వాహనాల రద్దీతో నాలుగు చోట్ల ప్రమాదాలు జరిగాయని పోలీసులు తెలిపారు. కొమరబండ వై-జంక్షన్ వద్ద ముందున్న కారుని వెనుకున్న కారు ఢీకొట్టడంతో రెండు కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాటిని హైవే అధికారులు క్రేన్ సహాయంతో తొలగించారు. దోరకుంట వద్ద కారు డివైడర్‌ను ఢీకొట్టగా ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పాలేరు బ్రిడ్జిపై ముందు వస్తున్న కారుని వెనుక కారు ఢీకొట్టడంతో రెండుకార్లు దెబ్బతిన్నాయి. హైవే అధికారులు క్రేన్ సహాయంతో వాటిని పక్కకి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దుర్గాపురం బైపాస్ వద్ద కూడా ఓ కారు ప్రమాదానికి గురైంది.



కోదాడ సమీపంలో ఢీకొన్న కార్లను క్రేన్‌తో తొలగిస్తున్న పోలీసులు

● మునగాల మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మొద్దులచెరువు, తాడ్వాయి, మునగాల, ముకుందాపురం ఆకుపాముల, మాధవరం గ్రామాల సమీపంలోని రోడ్డు పాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నియంత్రణకు ప్రత్యేకంగా కానిస్టేబుళ్లను ఏర్పాటుచేశారు. రోడ్డు మీద స్టాప్ బోర్డులను ఏర్పాటుచేసి, ఆయా గ్రామస్థులు రోడ్డు క్రాస్ చేసేటప్పుడు వాహనాలను సిగ్నల్‌పడిన విధంగా నిలిపివేశారు.





కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాలు, నల్లగొండ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

టోల్‌ప్లాజాల వద్ద...

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ మీదుగా రెండు రోజుల్లోనే 1,50,000 వాహనాలు వెళ్లినట్లు పంతంగి టోల్‌గేట్ ఏజెన్సీ నిర్వాహకులు డీఆర్‌ఎ ఇన్ఫ్రా ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం అర్ధరాతి 59వేల వాహనాలు వెళ్లగా, శనివారం 90,000 వాహనాల్లో పంతంగి టోల్‌గేట్ మీదుగా ప్రజలు పండుగకు వెళ్లారు. వీటిలో కార్లు అధికంగా ఉన్నాయి. పంతంగి టోల్‌గేట్ వద్ద 16గేట్లు ఉండగా, 12 గేట్ల ద్వారా వాహనాలను విజయవాడ వైపు పంపించారు. నాలుగు గేట్ల ద్వారా హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను పంపించారు.

● నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద 12 కౌంటర్లలో ఎనిమిది కౌంటర్లు విజయవాడ వైపు కేటాయించారు. శుక్రవారం ఉదయం ప్రారంభమైన వాహనాల రద్దీ శనివారం రాత్రి పొద్దుపోయే వరకూ కొనసాగింది. రెండు రోజుల్లో దాదాపు 48వేల వాహనాలు ఇరువైపులా ప్రయాణించాయి. ఒక్కో వాహనం ఫాస్టాగ్ స్కాన్ కావడానికి 3-4సెకండ్ల సమయం తీసుకోవడంతో ఏమాత్రం ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాలు ముందుకు కదిలి వెళ్లాయి. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి శనివారం కొర్లపహాడ్ టోల్‌ప్లాజాను సందర్శించి స్థానిక ఎస్ఐ ఎ.శివతేజ గౌడ్, టోల్ నిర్వహకులతో పరిస్థితిని సమీక్షించారు.

సజావుగా.. సాఫీగా.. ఏపీ వైపు పయనం

● ట్రాఫిక్ రద్దీ నివారణకు రాష్ట్ర సరిహద్దు వరకు పోలీస్ పహారా

● గతంతో పోల్చితే 30శాతం పెరిగిన వాహనాల సంఖ్య



మునగాల వద్ద పోలీసుల పర్యవేక్షణ

కోదాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో సంక్రాంతికి ఏపీ వైపు వెళ్లే వాహనదారులు క్షేమంగా తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు.అందులో భాగంగా హైదరాబాద్ నుంచి తెలంగాణ సరిహద్దు రామాపురం క్రాస్ రోడ్డు వరకు పోలీసులు బందోబస్తుతో పాటు వాహనాలు సులభంగా వెళ్లేందుకు ముందస్తుగానే ఏర్పాట్లుచేశారు. జాతీయ రహదారిపై సర్కిల్ పరిధిలో నలుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు,100మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా కోదాడ రూరల్ సీఐ సరిహద్దు వద్ద ఒక్కో షిఫ్ట్‌కు 8మంది ఇప్పటికే పనిచేస్తుండగా, ఆ సంఖ్యను మరో ఆరుకు పెంచటంతో పాటు ఏపీ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవటంతో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు వెళ్తున్నాయి. అంతేకాకుండా టోల్‌ప్లాజాల వద్ద కొంతమేర కౌంటర్లు తక్కువగా ఉండటంతో వాహనాలు టోల్‌ప్లాజా వద్దకు చేరుకోవటానికి 10 నిమిషాల సమయం పడుతోంది. దీంతో కొంతమేర వాహనాలు టోల్‌గేట్ల వద్ద నిలుస్తున్నాయి. నాలుగు సెకన్ల వ్యవధిలో ఫాస్టాగ్ స్కాన్ అయినప్పటికీ కౌంటర్లు తక్కువగా ఉండటంతో వాహనదారులు 10 నిమిషాల పాటు రహదారిపై నిలవాల్సి వస్తుంది. అయినప్పటికి అంతరాయం లేకుండా వాహనాలను ముందుకు పంపించేందుకు పోలీసులతో పాటు టోల్‌ప్లాజా సిబ్బంది పని చేస్తున్నారు. అదేవిధంగా ప్రతి క్రాసింగ్ వద్ద కానిస్టేబుల్‌ను ఏర్పాటుచేయటంతో వాహనాల రాకపోకలు సులభంగా కొనసాగాయి.

వరంగల్ హైవేపైనా...



బీబీనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా పరిధి లోని హైదరాబాద్-వరంగల్ జాతీయరహదారిపై సంక్రాంతి సందడినెలకొంది. శనివారం నుంచి ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌లో స్థిరపడిన పల్లెవాసులంతా సొంతూర్లకు పయనమయ్యారు. దీంతో వరంగల్ వైపు వెళ్లే హైవే మార్గంలో వాహనాల రద్దీ పెరిగింది. బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆరు టోల్‌గేట్లలో వాహనాలు బారులుతీరాయి. శనివారం సాధారణ రోజుల కంటే అదనంగా 3వేల వాహనాలు వరకు రాకపోకలు సాగించాయని సిబ్బంది తెలిపారు. కాగా జిల్లా సరిహద్దు కొండమడుగు మెట్టు సర్కిల్ వద్ద అలాగే ఎయిమ్స్, బీబీనగర్ బైపాస్ రోడ్డు సర్కిళ్ల వద్ద వాహనాలు యూ టర్న్ చేసుకునే సమయాల్లో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై

మాడ్గులపల్లి: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలకేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ శనివారం పెరిగింది. సాధారణ రోజుల్లో 10వేల వాహనాలు ప్రయాణం సాగిస్తుండగా శనివారం 13వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. ఫాస్టాగ్ నేపథ్యంలో ఎక్కువసేపు వేచి ఉండకుండా సునాయాసంగా వాహనాలు వెళ్లాయి.



ఉమ్మడి జిల్లాలోని బస్టాండ్లలో తీవ్ర రద్దీ నెలకొంది. కిక్కిరిసన ప్రయాణికులతో బస్టాండ్ల ఆవరణ, సర్వీసులు నిండిపోయాయి. ప్రధానంగా నల్లగొండ, సూర్యాపేట, కోదాడ, చౌటుప్పల్, భువనగిరి, హుజూర్‌నగర్, దేవరకొండ బస్టాండ్లలో సందడి నెలకొంది. బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికుల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. కిటికీల వద్ద ఉంటూ తమ వారిని బస్సుల్లోకి ఎక్కించారు.

సబ్‌ప్లాన్‌చట్టం సర్వరోగ నివారిణి

(5వ పేజీ తరువాయి)

దూరం చేయాలని చూశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. హక్కులపై స్వేచ్ఛగా ప్రశ్నించే చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఆ చట్టాలను అమలు చేసే బాధ్యత ప్రతీ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా వచ్చిన భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ లైన్లు వేసే క్రమంలో అటవీ శాఖ నుంచి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకే అటవీ సాగు భూములకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని భావిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సాగునీటిని అందించి అటవీ భూములను సాగులోకి తెచ్చే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. సౌరశక్తికి అవసరమైన అన్నిఏర్పాట్లను ప్రభుత్వమే చేస్తుందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ , డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ లు బీసన్న, జనార్ధన్, ఎస్ఐలు సంపత్, వీరబాబు, నారాయణరెడ్డి, కమిషనర్ శ్రీను, నాయకులు అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ ఛైర్మన్ కొప్పుల రాజు, ట్రైకార్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, నందికొండ మునిసిపల్ ఛైర్‌పర్సన్ అన్నపూర్ణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి, సక్రునాయక్, మునినాయక్, పాండునాయక్, నాగేశ్వర్‌నాయక్, స్వామినాయక్, చందునాయక్, నరేందర్‌నాయక్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు. అంతకుముందు హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం విక్రమార్కతో పాటు మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు సాగర్‌కు చేరుకోగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, బీఎల్‌ఆర్, సామేలు, బాలునాయక్, రాందాసులు స్వాగతం పలికారు.

డిప్యూటీ సీఎంకు వినతుల వెల్లువ

ఆదివాసీ శిక్షణ కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు సాగర్ ప్రాంతంలో పలు చెంచు, గిరిజన, ఆదివాసీ, ఎరుకల, వడ్డెరకాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను తెలుసుకుని నివేదికలు తయారుచేశారు. ఈ నివేదికను డిప్యూటీ సీఎం విక్రమార్కకు ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ అందజేశారు. శిక్షణ పొందిన 100 మందికి డిప్యూటీ సీఎం సర్టిఫికెట్లు అందజేశారు.

మైక్ సౌండ్ పెంచమని పలుమార్లు మంత్రి విన్నపం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడే ముందు మైక్ సౌండ్ పెంచాలని పలుమార్లు నిర్వాహకులను కోరారు. అంతేకాకుండా బెల్లయ్యనాయక్‌ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకువచ్చింది తానేనని మంత్రి గుర్తు చేశారు.

బీజేపీ ప్రజల మధ్య విభజనకు పాల్పడుతోంది..

కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీలను మరింతగా దగ్గరయ్యేలా చేస్తుందన్నారు. నెహ్రూ కాలంలోనే ఆదివాసీల కోసం రాజ్యాంగంలో అనేక నిబంధనలను చేర్చారని గుర్తు చేశారు. కానీ నేడు కేంద్రంలోని బీజేపీ మాత్రం మణిపూర్‌లో ఆదివాసీల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టిస్తోందన్నారు. ఆదివాసీల కోసం కాంగ్రెస్ అనేక సంక్షేమ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. రాహుల్‌గాంధీ దూరదృష్టితోనే ఇటువంటి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయిలో ఉందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలంటే గ్రామస్థాయిలో కాంగ్రెస్ పథకాలను ప్రజాప్రతినిధులు ప్రచారం చేయాలన్నారు. జనాభాలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశం భారతదేశం బాగుండాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు. అందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తండాలతో నాకు ఎక్కువ అనుబంధం

విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క ఆధ్వర్యంలో వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు రేషన్‌కార్డుల పంపిణీ చేస్తామని, కుటుంబంలో ఒక్కొక్కరికీ ఆరు కిలోల సన్న బియ్యం అందజేస్తామన్నారు. తండాలతో తనకు ఎంతో అనుబంధం ఉందని, పార్లమెంట్‌లో పలుమార్లు గిరిజనుల, ఆదివాసీల గురించి ప్రస్తావించానన్నారు.

ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ఆత్మహత్య

మద్దిరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాలలో జరిగింది. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల గ్రామానికి చెందిన ఎల్లు వెంకట్‌రెడ్డి(43) పదేళ్ల నుంచి ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో అతడి భార్యాపిల్లలు ఆయన్ను వదిలి వేరేచోట ఉంటున్నారు. వెంకట్‌రెడ్డి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. శనివారం ఇంటి ముందు ఉన్న పశువుల కొట్టం నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు వెళ్లి చూశారు. వెంకట్‌రెడ్డి ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి పోలీసులకు తెలిపారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులతో ఉడాయింపు



» అప్పులు చేసి తెలియని వ్యాపారాల్లో పెట్టుబడులు
» కోట్లకు పడగలెత్తాలనే ఆశతో అప్పులు
» లబోదిబోమంటున్న బాధితులు
» ఉమ్మడి జిల్లాలో వరుస సంఘటనలు
» ముందస్తుగా ఐపీ దాఖలు చేస్తున్న కొందరు

త్వరగా కోట్లకు పడగలెత్తాలనే ఆశ వారి ప్రాణాల మీదకు తెస్తోంది. సమాజంలో అందరికంటే భిన్నంగా జీవించాలనే స్వార్థం కొందరు స్థోమతకు మించి అప్పులు చేయిస్తోంది. ఆ అప్పులను వారికి ప్రావీణ్యం లేని వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారు. చివరికి ఉడాయించడమో లేక ఆత్మహత్యకో పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు తరచుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడో ఒక చోట ఇటీవల జరుగుతూనే ఉన్నాయి. అప్పులు తీసుకున్న వారు ఉడాయించినా, ఐపీ దాఖలు చేసినా, ఆత్మహత్య చేసుకున్నా వారికి జరిగే నష్టం కంటే అప్పులు ఇచ్చిన వారికి ఎక్కువ నష్టం జరుగుతోంది.
(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

రెండేళ్ల కిందట సూర్యాపేట జిల్లా కేంద్రంలో గోదేశి నరేంద్రబాబు అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాలో సంచలనంగా మారింది. కోట్లలో చేసిన అప్పులు ఎక్కడ వెచ్చించాడో తెలియని పరిస్థితి. రూ.కోట్లలో అప్పులు ఇచ్చిన వారు నేడు లబోదిబోమంటున్నారు. కాయకష్టం చేసి కూడబెట్టిన కొందరు, ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన డబ్బులు కొందరు, వ్యాపారాల్లో వచ్చిన డబ్బులు మరికొందరు అప్పులుగా ఇచ్చారు. అప్పు తీసుకున్న నరేంద్రబాబు మృతితో వారు కూడా పెద్దఎత్తున నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పులిచ్చిన వారికి జరుగుతున్న నష్టం నరేంద్రబాబు విషయంలో స్పష్టమవుతుంది. నరేంద్రబాబుకు అందరూ న్యాయసమ్మతమైన వడ్డీకి అప్పు ఇచ్చిన వారే. ఇలాంటి వారితో అప్పులు ఇచ్చిన వారు కూడా నష్టాల ఊబిలోకి నెట్టివేయబడుతున్నారు. సమాజంలో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైనా అత్యవసర సమయంలో అప్పులు పుట్టని పరిస్థితి దాపురించింది. తాజాగా కోదాడలో బుక్స్ స్టేషనరీ దుకాణం నిర్వహించే ఓ వ్యాపారి పలువురి వద్ద సుమారు రూ.కోటిన్నర వరకు అప్పులు చేసి అవి తీర్చలేక ఉడాయించాడు. ఈ విషయమై బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

లబోదిబోమంటున్న బాధితులు



అప్పుల తీసుకున్న వారు ఉడాయిస్తుండటంతో అప్పులిచ్చిన వారు లబోదిబోమమంటున్నారు. కొంత మంది బయటికి చెప్పుకోలేక లోలోన మదన పడుతున్నారు. పిల్లల వివాహాల కోసం కొందరు, ఇంటి నిర్మాణాలకు ఉపయోగపడుతాయని కొందరు, సంపాదించే దానిలో నెలానెలా కొంత పొదుపు చేసిన డబ్బులను మరికొందరు అప్పులుగా ఇస్తున్నారు. సమాజంలో అప్పులు తీసుకునే వారి కుటుంబానికి మంచి పేరు ఉండడం, అందరితో కలివిడిగా ఉండడం, ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద అప్పులు చేయడం లాంటివి చేస్తుంటారు. అప్పుల రూపంలో తీసుకున్న డబ్బులను ఎక్కడో ఒక చోట అత్యాశకు పోయి పెట్టుబడిగా పెడుతున్నారు. అక్కడి నుంచి రెట్టింపు కాదుకదా అసలు రావడం లేదు. అప్పటివరకు అప్పులు చేసిన విషయం సమాజంలో పెద్దగా తెలియదు. దీంతో అప్పులు ఇచ్చిన వారికి నిర్దేశించిన సమయం రావడంతో వారు వారి యొక్క డబ్బులు ఎలాగైనా వసూలు చేసుకోవాలని ప్రయత్నం చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో అప్పులు ఇచ్చిన వారందరి విషయాలు తెలిసి అసలు ఎంతమంది వద్ద ఎంత మొత్తంలో అప్పులు ఇచ్చారన్న విషయం బయటకు వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో సంఘటనలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో 2017లో ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారానికి ఓ యువకుడు పెద్దమొత్తంలో అప్పులు తీసుకున్నాడు. దాంతో పాటు వారితో వ్యాపారంలో పెట్టుబడులు పెట్టించాడు. ఒక్కసారిగా వ్యాపారంలో ఒడిదొడుకులు ఎదురవగానే అప్పులు ఇచ్చిన వారికి డబ్బులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో డబ్బుల కోసం ఇతర ప్రాంతానికి వెళ్లి ఫోన్ స్విచ్ఛాప్ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధితులు యువకుడి కుటుంబసభ్యులపై ఒత్తిడి తేవడంతో తట్టుకోలేక ఆ కుటుంబంలోని ఆరుగురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇదే కాకుండా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆరేళ్ల క్రితం ఓ చిట్‌ఫండ్ నిర్వాహకుడు పారిపోయాడు. స్వయంగా బంధుమిత్రులతో పాటు ఇతరులను కూడా మోసం చేసి సుమారు రూ.3 కోట్ల మేర అప్పులతో ఉడాయించాడు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అదే విధంగా పలువురు ప్రైవేట్‌గా నెలనెలా చిట్టీలు నిర్వహించే వారు సైతం ఉడాయించిన సంఘటనలు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో గతంలో మిర్యాలగూడలో ఓ కిరాణం వ్యాపారి సుమారు రూ.5 కోట్ల మేర అప్పులు చేసి ఉడాయించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెద్దఎత్తున అప్పులు చేసి ఉడాయించేందుకు సిద్ధమై ఐపీ దాఖలు చేశాడు. దీంతో అప్పులు ఇచ్చిన వారు కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఐదేళ్ల కిందట అప్పులతో ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. సంబంధిత వ్యాపారికి పెద్దఎత్తున ఆస్తులు ఉన్నా అంతకంటే ఎక్కువ మొత్తంలో అప్పులు కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సమాచారం. కోదాడలో ఓ చిట్‌ఫండ్ నిర్వాహకుడు కూడా కొన్నేళ్ల క్రితం ఉడాయించాడు. అనేక మంది బాధితులు ఆందోళన చేశారు. సంబంధిత యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపారు. వీరే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం, పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు కొంత మంది పెద్దఎత్తున రైతులకు చెల్లించాల్సిన డబ్బులను చెల్లించకుండా పారిపోతున్నారు. ఇటీవల సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో ఎక్కువగా వ్యాపారుల ఉడాయింపులు జరుగుతున్నాయి. కోదాడలో ఏడేళ్లలో 10మంది సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి ఐపీ దాఖలు చేసినట్లు సమాచారం. కొన్నేళ్ల క్రితం ఓ మొబైల్ షాపు యజమాని కూడా సుమారు రూ.3కోట్లు ఐపీ దాఖలు చేశాడు. అదేవిధంగా నాలుగేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ కమీషన్ వ్యాపారి అప్పులు ఎక్కువ కావడంతో పరారయ్యాడు. అతను కూడా సుమారు రూ.5కోట్ల మేర అప్పులు చేసినట్లు సమాచారం. ఏడాది క్రితం సూర్యాపేటకు చెందిన ఓ యువకుడు సెకండ్ హ్యాండ్ బైక్‌ల వ్యాపారం పేరుతో పట్టణంలోని కొందరి వద్ద అధిక వడ్డీలకు సుమారు రూ.3కోట్ల మేర అప్పులు చేసి తీర్చలేక ఉడాయించాడు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

ముందస్తుగా ఐపీ దాఖలు చేస్తున్న వ్యాపారులు

అప్పులు తీసుకొని ఉడాయించేందుకు సిద్ధమైన వ్యాపారులు ముందస్తుగా న్యాయస్థానంలో ఐపీ దాఖలు చేస్తున్నారు. ఎవరైతే అప్పులు ఇచ్చారో వారందరికీ నోటీసులు పంపుతున్నారు. అప్పులు ఇచ్చిన వారు నోటీసులు చూసి ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఉడాయించేందుకు ముందుగానే సిద్ధపడి ఎవరికీ అనుమానం రాకుండా అప్పులు ఇచ్చిన వారిని నమ్మిస్తూ రాత్రి రాత్రే ఇంటికి తాళం పెట్టి కుటుంబసభ్యులతో సహా పారిపోతున్నారు. సంబంధిత వ్యాపారి పారిపోయిన సంఘటనలు కూడా కొన్ని రోజుల వరకు తెలియడం లేదు. అప్పులు ఇచ్చిన వారు ఒకరి వెంట ఒకరు వచ్చి ఉడాయించిన సంఘటన తెలుసుకొని లబోదిబోమంటున్నారు. ఐపీ దాఖలు చేసిన వారు మాత్రం సమాజంలో దర్జాగా తిరుగుతున్నారు. అప్పులు ఇచ్చిన వారికి కోర్టు ద్వారా నోటీసులు పంపి చేతులు దులుపుకుంటున్నారు.

అత్యాశకు పోయి అప్పులు ఇవ్వొద్దు



ప్రజలు అత్యాశకుపోయి అప్పులు ఇవ్వొద్దు. చట్టవ్యతిరేకంగా వడ్డీల వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటాం. అప్పులు తీసుకుని ఉడాయించిన వారిపై ఫిర్యాదు చేస్తే న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాం. అప్పులు ఇచ్చిన వారు వారి వద్ద ఉన్న ప్రామిసరీ నోట్లు, చెక్కులతో కోర్టుల్లో కేసులు వేసుకుని న్యాయం పొందాలి. స్థోమతకు మించి అప్పులు చేసి వ్యాపారాలు చేయవద్దు.

సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ సూర్యాపేట

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చిట్యాల రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఒడిషా రాష్ట్రానికి చెందిన కమల్‌సాయి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇటుకబట్టీలో కార్మికుడిగా చేస్తూ నాలుగు రోజుల క్రితం వెలిమినేడుకు వచ్చాడు. తిరిగి గ్రామానికి వెళ్లే క్రమంలో వెలిమినేడు సబ్‌స్టేషన్ నుంచి రోడ్డు దాటుచుండగా హైదరాబాద్ నుండి వచ్చే ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో కమల్‌సాయి గాయమైంది. స్థానికులు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ధర్మ తెలిపారు.

కారు ఢీ కొని ...

వలిగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా అజాగ్రతతో కారు నడుపుతూ మోపెడ్‌ను ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన నారి మల్లయ్య(65) మోపెడ్ వాహనంపై వెళ్తున్నాడు. భువనగిరి నుంచి చిట్యాల వైపు అతివేగంగా కారు నడుపుతూ మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మల్లయ్య (ఫైల్‌ఫోటో)

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



కోదాడలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

కోదాడ టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు శనివారం పట్టణంలోని తేజ పాఠశాల ఆవరణలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. కోదాడ ప్రాంతం నుంచి ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలో రాణిస్తున్నారని అన్నారు. రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను మొదటిసారిగా కోదాడలో ఏర్పాటు చేసినందుకు జాతీయ స్థాయి క్రీడాకారిణి, తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, పోటీల నిర్వాహకురాలు పాలడుగు ఖ్యాతిని అభినందించారు. అనంతరం ఖ్యాతి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మొదటి రోజు 120 మంది క్రీడాకారులు వచ్చారన్నారు. జూనియర్, సీనియర్ క్యాటగిరిలో పురుషులు, మహిళలకు, అదేవిధంగా యూత్ విభాగంలో బాయ్స్, గర్ల్స్‌కు పోటీలు నిర్వహించామన్నారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కోదాడ మునిసిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రాష్ట్ర నాయకులు మహబూబ్ జానీ, మేకల వెంకట్రావు, మునిసిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, వెయిట్ లిఫ్టింగ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పుల్లారావు, జానకి రామయ్య, హనుమంత,రాజు, శివ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, శివ, గణేష్, సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

హుజూర్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోనిమాధవరాయనిగూడెంలో తెలుగు రాష్ట్రాల స్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలను ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకుడు భార్గవాచారి తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి బహుమతి రూ.20వేలు, మెమెంటో, ద్వితీయ బహుమతి రూ.18వేలు, మెమెంటో, మూడో బహుమతి రూ.16వేలు, నాలుగో బహుమతి రూ.14వేలు, 5వ బహుమతి రూ.13వేలు, బెస్ట్ రైడర్ రూ.2వేలు, బెస్ట్ డిఫెండర్ రూ.2వేలు, బెస్ట్ టీమ్ రూ.2వేలు, ఆల్‌రౌండర్ రూ.2వేలు ఇస్తామని క్రీడాకారుడు భార్గవచారి తెలిపారు. ఈ నెల 12న ఉదయం 10 గంటలకు ఈ పోటీలను సీఐ చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్య ప్రారంభిస్తారని తెలిపారు.



సామాన్యులపై

ధరాఘాతం


(5వపేజీ తరువాయి)

ఆలోచన కాగితాలకే పరిమితంకావడంతో జిల్లాలో కూరగాయాల సాగు విస్తరించలేదు. చాలామంది రైతులు తమ కుటుంబ అవసరాలకు సరిపడా ఏదో ఒక చిన్న మడిలో కూరగాయలు సాగు చేస్తున్న పరిస్థితి. అత్యధికంగా పెద్దఅడిశర్లపల్లి మండలంలో దొండసాగు ఉన్నప్పటికీ దొండకాయ కిలో రూ.80 పలుకుతుంది. అయితే మార్కెట్‌లోకి వచ్చే సరికి కిలో రూ.80 ఉన్నా రైతులకు మాత్రం గిట్టుబాటు ధర రావడంలేదు. దళారులు మాత్రమే ఈ దొండ విక్రయాలతోలాభం పొందుతున్నారు.

మాంసం ధరలకు రెక్కలు

సామాన్యులు మాంసం కొనుగోలు చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. పండుగవేళ కుటుంబ సభ్యులంతా కలిసి ఒక్కపూట భోజనం చేయాలన్నా మాంసం కోసం రూ.1000 ఖర్చు చేయాల్సి వస్తోంది. వారం రోజులుగా చికెన్, మటన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. గత వారం క్రితం చికెన్ కిలో రూ.170 ఉండగా, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయిస్తున్నారు. పండుగరోజు మరింతగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. 10 రోజుల క్రితం మటన్ రూ.800 ఉండగా ప్రస్తుతం రూ.950 వరకు చేరింది. ఇది చాలదన్నట్లు పండగ రోజు వ్యాపారులు తాజా మటన్ పేరుతో మరింత ధరలు పెంచే అవకాశం లేకపోలేదు.





నిత్యావసర వస్తువుల ధరలు..	
చింతపండు	120
ఎర్ర పప్పు	90
పెసరపప్పు	120
కందిపప్పు	150
ఎండుమిర్చి	170
సన్‌ఫ్లవర్	145
పల్లి నూనె	150
పామాయిల్	135
పసుపు(100గ్రా)	25
చక్కెర	42
బెల్లం	60
ధనియాలు	120
జీలకర్ర(100గ్రా)	40
అల్లం	60
ఎల్లిగడ్డ	300
ఉల్లిగడ్డ	40

కూరగాయల ధరలు..	
టమాట	10
బెండకాయ	100
చిక్కుడుకాయ	100
బీరకాయ	100
ఆలుగడ	40
దోసకాయ	50
కాకరకాయ	40
వంకాయ	40
క్యారెట్	50
క్యాబేజీ	50
దొండకాయ	80
గోకరకాయ	80
మునగకాయ	160
క్యాలీఫ్లవర్	50
క్యాప్సికం	100

రూ.500కు ఏమీ రావడం లేదు



రూ.500 తీసుకొని మార్కెట్‌కు వెళితే ఏంరావడం లేదు. పెరుగుతున్న ధరలను చూస్తే భయమేస్తుంది. ఇలాగే ఉంటే బతకడం కష్టం. ప్రభుత్వాలు నిత్యావసర ధరలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. ఉచితాల బదులు వీటిపై దృష్టి సారిస్తే బాగుంటుంది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంవల్ల పండుగ చేసుకోవాలంటే కూడా భయపడే పరిస్థితి ఉంది.

- ప్రేమలత, గృహిణి నల్లగొండ.

ధరలు మండి పోతున్నాయి



నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. ఇలాగే ఉంటే సంక్రాంతి పండగ చేసుకోవడం కష్టమే. కూరగాయలు కొనే పరిస్థితి కనిపించడం లేదు. కిలో ఎల్లిగడ్డ రూ.300కు విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలు పరిస్థితి అంతే ఉంది. నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగిన నేపథ్యంలో కనీసం చౌకధరల దుకాణాల ద్వారానైనా నిత్యావసరాలు అందించాలి. ధరలు పెరగడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కె. రవేల గృహిణి నల్లగొండ.

క్రీడలతో పెంపొందే స్నేహభావం



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు

నేరేడుచర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలతో పల్లెల్లో ప్రశాంత వాతావరణంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. చలసాని రాజీవ్ అన్న యూత్ ఆధ్వర్యంలో కల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్ర గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంచుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చినవెంకటరెడ్డి, ఎస్‌ఐ రవీందర్‌నాయక్, నాయకులు చలసాని శ్రీనివాసరావు, చలసాని రాజీవ్, రామారావు, మాధవరావు, సత్యనారాయణ, భాస్కర్‌రావు, జ్యోతిబాబు, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, వినోద్, ప్రేమ్‌కుమార్, గుర్వయ్య పాల్గొన్నారు.

భవానికి తెలుగు నంది పురస్కారం



తెలుగు నంది పురస్కారం అందుకుంటున్న భవాని

మఠంపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండల కేంద్రానికి తెలుగు ఉపాధ్యాయుని సోమయాదుల భవానికి నంది పురస్కారాన్ని తెలుగు, వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో అందజేశారు. విద్య, సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు స్వామి వివేకానంద జయంత్యుత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో భవానికి నంది పురస్కారాన్ని సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, తెలుగు, వెలుగు వ్యవస్థాపకుడు పూలోజు రాజ్‌కుమార్, వంగాల శాంతికృష్ణ, అమృతపుడి రేవతి, సాహితీ వేదిక సభ్యులు అందజేశారు. మండలంలోని పెద్దవీడు జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా భవాని విధులు నిర్వహిస్తున్నారు.

భువనగిరిలో టెన్షన్.. టెన్షన్

● బీఆర్ఎస్ యాదాద్రిభువనగిరి జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ● సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి వివాదాస్పద వ్యాఖ్యలు

భువనగిరి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎంను అసమర్థుడు, రండ అంటూ పదే పదే మాట్లాడిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆగ్రహించిన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. కేసీఆర్, కేటీఆర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ప్రతిగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నిరసనగా వెళ్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసే వరకు ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. దీంతో పట్టణంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

సీఎం, ఆ పార్టీ ఎమ్మెల్యేలే లక్ష్యంగా

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లక్ష్యంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని లేపాయి. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలు రైతుభరోసా, కల్యాణ లక్ష్మీ పథకంలో తులం బంగారం, బాలికలకు స్కూటీ, డబుల్ బెడ్ రూం ఇళ్లు తదితర ఎన్నికల హామీలేవీ ఏడాది గడుస్తున్నా నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను అవినీతిపరులని ప్రచారం చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, అనుమతులు లేని వెంచర్ల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన ఫిర్యాదులతో యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారని విమర్శించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ప్రతి రోజూ జాజిరెడ్డిగూడెం పరిసరాల్లోని వాగు నుంచి రోజుకు 400 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ దోపిడీకి పాల్పడుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, మిగతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్‌ను రండ అన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డియే అసలైన రండ, అసమర్థుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతే కాక కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఉటంకిస్తూ సీఎంను పదే పదే రండ అంటూ వ్యాఖ్యానించారు. రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీంతో ఆగ్రహించిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగ ప్రవీణ్, వస్తువుల సాయి, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యాలయంపై అకస్మాత్తుగా దాడికి దిగి



కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. కార్యాలయం ఎదుట బైఠాయించి బీఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

కార్యాలయంపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ధ్వంసమైన ఫర్నిచర్‌ను పరిశీలించి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి వెంటఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలు, జెండాలను చించివేశారు. సీఎం ఫ్లెక్సీని దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైఠాయించారు. దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దాడులతో బీఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను భయపెట్టలేరని, సీఎం రేవంత్‌రెడ్డి ఖబడ్దార్, బీఆర్ఎస్ కార్యకర్తలు తిరగబడితే కాంగ్రెస్ కార్యకర్తలెవరూ రోడ్లపై తిరగరని అన్నారు. చేతనైతే ఎన్నికల హామీలను నెరవేర్చాలి కానీ ప్రశ్నించే వారి



భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

గొంతుకను మూయవద్దన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అణిచివేయబడిన భువనగిరిలోని కొన్ని అరాచక శక్తులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే విజృంభిస్తున్న పరిణామాలను పోలీసులు గ్రహించాలన్నారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రైతు బంధు, జిల్లా గ్రంథాలయ సంస్థ, మునిసిపల్ మాజీ చైర్మన్లు కొలుపుల అమరేందర్, డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, ఎనబోయిన ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు అతికం లక్ష్మీనారాయణ, కేశవపట్నం రమేష్, ఏవి కిరణ్‌కుమార్, జనగాం పాండు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం: సీపీఎం

భువనగిరి గంజ్, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిని ఖండిస్తున్నామని సీపీఎం యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శ ప్రతి విమర్శ సహజమన్నారు. ఆయా సందర్భాల్లో పాలకులు చేస్తున్న పనులపైన ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తుంటాయని, ఆ సందర్భంలో తప్పు పదాలు మాట్లాడితే తప్పును ఎత్తి చూపేలా ఉండాలి కాని దాడులు చేసి గాయపరిచేలా ఉండకూడదని ఆయన సూచించారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు

మోత్కూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల దాడి నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి స్వగ్రామమైన మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలోని ఆయన ఇంటి వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామన్నపేట సీఐ ఎన్. వెంకటేశ్వర్లు, మోత్కూరు ఎస్‌ఐ డి. నాగరాజు నేతృత్వంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద లేరని, హైదరాబాద్‌లో ఉన్నారని తెలిసింది.



రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుల

శాస్త్రోక్తంగా అధ్యయనోత్సవాలు



తిరువీధి సేవలో ప్రబంధ పారాయణాలు, వేణుగోపాల అలంకరణలో స్వామివారు



భువనగిరి అర్బన్, జనవరి 11(ఆంధ్ర జ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో అధ్యయనోత్సవాలు శనివారంతో రెండో రోజు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం వేణుగోపాల(కృష్ణాలంకారం) స్వామికి దివ్య ప్రబంధ పారాయణాలు, సాయంత్రం గోవర్ధన గిరిధారి ద్రావిడ ప్రబంధ పారాయణాలను పారాయణికులు పఠిస్తుండగా ప్రధానార్చకులు ప్రధా నార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహ చార్యులు, కాండూరి వెంకటాచార్యులు ఉత్సవాలు వైభవంగా నిర్వహి ంచారు. వేడుకల్లో ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్క రాయణి నరసింహమూర్తి, ఏఈవో నవీన్, పర్యవే క్షకులు రాజన్‌బాబు, రామరావు ఉన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

ఆలయంలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్ర భాతసేవతో గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను మేల్కొలిపిన అర్చ కులు ప్రతిష్టామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. సాయంత్రం ప్రధా నాలయ ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సహస్ర నామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారా ధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వలిగొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన నారి మల్లయ్య(65) తన మోపెడు వాహనంపై రహదారిపై వెళ్తున్నాడు. భువనగిరి నుంచి చిట్యాల వైపునకు అతి వేగంగా వచ్చిన కారు మోపెడును వెనుక నుంచి ఢీకొంది. దీంతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు నానో ట్రాక్టర్

తక్కువ పెట్టుబడితో అధిక లాభాన్నిచ్చే నానో ట్రాక్టర్ తయారు చేసిన మోడల్ స్కూల్ విద్యార్థులు, ఢిల్లీ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన

తుర్కపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక లాభాన్నిచ్చే నానో ట్రాక్టర్‌ను తయారు చేసిన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని రామాపురం మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. పాఠశాల పదో తరగతి విద్యార్థులు లూనావతు అఖిల్, బానోతు తరుణ్ గైడ్ టీచర్ కోట నవీన్ పర్యవేక్షణలో నానో ట్రాక్టర్‌ను తక్కువ ఖర్చుతో తయారు చేశారు. ఈ ప్రాజెక్టును 2024 సెప్టెంబరులో భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ మేళాలో ప్రాజెక్టు ఉత్తమ అవార్డుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 7న హైద్రాబాద్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో 33జిల్లాల నుంచి 33 ప్రాజెక్టులు ప్రదర్శించగా, ఈ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్పోర్ట్స్ ప్రిన్స్‌పల్ సెక్రటరీ నుంచి విద్యార్థులు ప్రశంసాపత్రం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్టు ఇదే.

ఢిల్లీ నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్ పోటీలకు..

దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో శనివారం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ నేషనల్ యూత్ ఫెస్టివల్-2025 సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని తాము రూపొందించిన ఎలక్ట్రిక్ నానో(మినీ) ట్రాక్టర్‌కు సంబంధించిన ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను వివరించారు. అంతకుముందు విద్యార్థులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. విద్యార్థులను ప్రిన్‌పాల్ అంబటి శోభారాణి, టీచర్లు అభినందించారు.

నానో ట్రాక్టర్ తయారీ విధానం


ప్రస్తుత తరుణంలో వ్యవసాయ కూలీలు లేకుండా వ్యవసాయం చేయాలేని పరిస్థితి రైతులకు నెలకొంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాన్నిచ్చే ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌ను మోడల్ స్కూల్ విద్యార్థులు లూనావతు అఖీల్, బానోతు తరుణ్ గైడ్ టీచర్ కోట నవీన్ పర్యవేక్షణలో నానో ట్రాక్టర్‌ను తక్కువ ఖర్చుతో తయారు చేశారు. పడేసిన చేతక్ (స్కూటర్) నుంచి ముందు వీల్, హ్యాండిల్‌ను తీసుకుని కారుకు వాడే బ్యాటరీలతో ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌ను తయారు చేశారు. . దీనికి పెట్టుబడి రూ.30వేలు అయినట్లు తెలిపారు. ఈ నానో ట్రాక్టర్ డీజిల్, పెట్రోల్ అవసరం లేకుండానే బ్యాటరీ సహాయంతో నడుస్తుందన్నారు. ఈ యంత్రంతో పొలంలో దుక్కి దున్నుకోవచ్చునని, పొలంలో కలుపు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అంతర్ పంటల్లో కలుపుతో బరువులు తీసుకపోవడడానికి ఉపయోగపడుతుందన్నారు. పంటలకు స్ప్రే చేయడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. ట్రాక్టర్ చేసే పనులన్నింటినీ దీంతో చేసుకోవచ్చునని తెలిపారు.



గైడ్ టీచర్ కోట నవీన్‌తో విద్యార్థులు అఖిల్, తరుణ్

గాలి వస్తే మంటలే

- పద్మానగర్‌లో భయంకరంగా విద్యుత్‌తీగలు
- భయాందోళనకు గురవుతున్న స్థానికులు
- ఓపెన్ డ్రైనేజీ అవుట్ లెట్ లేక ఇక్కట్లు
- పరిష్కరించాలని కాలనీవాసుల వినతి


కరెంట్ తీగలకు మొక్కలకు అల్లుకున్న తీగలు

నల్లగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో ఉన్న 35వ వార్డులోని పద్మానగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. విద్యుత్ తీగల సమస్యలతో పాటు డ్రైనేజీతో ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్ వెనక ప్రాంతంలో 33/11 కేవీ మెయిన్ తీగలకు కొన్ని పిచ్చి మొక్కలతో పాటు పలు మొక్కలకు సంబంధించిన తీగలు చుట్టుకొని పలుమార్లు గాలిదుమారం వచ్చినప్పుడల్లా మంటల చెలరేగుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సబ్‌స్టేషన్ పక్కన, వెనక అనేక నివాస గృహాలు ఉన్నాయి. ఈ మెయిన్ తీగలకు తిప్ప తీగలతో పాటు ఇతర మొక్కలకు చెందిన తీగలు భారీగా పెరిగి కరెంట్ తీగలకు అల్లుకున్నాయి. స్థానిక ప్రజలతో పాటు ఆ వార్డు కౌన్సిలర్ అనేక సార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఎల్‌సీ తీసుకొని కరెంట్ తీగలకు ఉన్న చెట్లను తొలగించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పద్మానగర్‌లోని ఈ సబ్‌స్టేషన్ వెనక ఉన్న ప్రాంతం తమది కాదంటే తమదు కాదని విద్యుత్‌శాఖకు చెందిన టౌన్ -2 అధికారులతో పాటు రూరల్ అధికారులు పేర్కొనడం గమనార్హం. ఆ ప్రాంతం ఏ అధికారి కింద ఉందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉరుములు, మెరుపులు వస్తే కరెంట్ తీగల నుంచి వచ్చే మంటలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. హైటెన్షన్ వైర్లకు మొక్కల తీగలు అలుముకుంటే అధికారులు పట్టించుకోక పోవడంతో వర్షం వచ్చినప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి.

అద్దె ఇంట్లో ఉండి చనిపోతే కర్మ కార్యక్రమాలకు...

అద్దె ఇంట్లో నివసిస్తూ ఉన్న నిరుపేదలు ఎవరైనా చనిపోతే వారి దశదినకర్మ కార్యక్రమాలు చేయడానికి అనేక సమస్యలు ఎదుర్కొన్న పరిస్థితులు ఆ కాలనీలో అనేకం ఉన్నాయి. కొందరూ ఏకంగా శ్మశానవాటికలోనే 10వ రోజు కర్మ కార్యక్రమాలు నిర్వహించుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఇంటి యజమానులు మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారిని దహన సంస్కారాలు కూడా నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వకపోవడంతో నిరుపేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. 35వ వార్డులో కార్మికులు అధికంగా ఉన్నందున వారికి స్థలం కేటాయించి భవన నిర్మాణం చేయించి కర్మ కార్యక్రమాలు నిర్వహించుకునేలా చూడాలని కోరుతున్నారు.

ఆ ప్రాంతం మా పరిధిలో లేదు

సబ్‌స్టేషన్ వెనక ఉన్న ప్రాంతం తమ పరిధిలో లేదని టూటౌన్ ఏఈ రవీందర్ పేర్కొనగా తాను రూరల్ ఏఈ అని షరీఫ్ పేర్కొంటూ ఆ ప్రాంతం తమ పరిధిలోకి రాదన్నారు. ఇద్దరు ఏఈలు తమది కాదంటే తమది కాదని చెబుతున్నారు. దీంతో సమస్యలు ఎదుర్కొంటున్న వారు తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మంటలు వచ్చినప్పుడల్లా భయాందోళనకు గురవుతున్నారు.

అవుట్ లెట్ లేక మురుగునీటి నిల్వలు

35వ వార్డులో ఓపెన్ డ్రైనేజీకి సంబంధించి నీటి నిల్వలను డ్రైనేజీ కలపకపోవడం, అవుట్ లెట్ లేకపోవడంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీటి వల్ల దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా పందులు సైతం స్వైరవిహారం చేస్తున్నాయి. మునిసిపల్ అధికారులకు ఈ విషయంపై తెలియజేసినా ఓపెన్ డ్రైనేజీకి సంబంధించి అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించడం లేదు. నాలుగేళ్లుగా స్థానికులు అధికారుల చుట్టూ తిరిగిన ఏ మాత్రం స్పందించడం లేదని సమాచారం. కౌన్సిల్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించినా అధికారులు చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ తెలిపారు.


డ్రైనేజీ అవుట్ లేక ప్రవహిస్తున్న మురుగునీరు

వార్డు సమస్యలను పరిష్కరించాలి



35వ వార్డులో సమస్యలను వెంటనే పరిష్కరించాలి. నిరుపేదలు అధికంగా ఉండే తమ కాలనీకి ఇళ్లను కూడా మంజూరు చేయాలి. సబ్‌స్టేషన్ వెనక ఉన్న ప్రాంతంలో కరెంట్ తీగలకు ఉన్న చెట్లను తొలగించి మంటలు రాకుండా చూడాలి. అదేవిధంగా డ్రైనేజీ అవుట్ లెట్ లేకపోవడంతో మురుగు నీటి నిల్వలు ఉండి సమస్యలు ఏర్పడుతున్నాయి. వెంటనే సమస్యలను పరిష్కరించాలి.

\- గుర్రం ధనలక్ష్మి, కౌన్సిలర్

ప్రశాంతంగా టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నల్లగొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) డ్రాయింగ్ హయ్యర్, లోయర్, టైలర్ లోయర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష సెంటర్‌లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 849మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 667 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 182 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో ఎస్పీఆర్, ఎంవీఆర్, డైట్, గర్ల్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను డీఈవో భిక్షపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వినోద్‌కుమార్

శాలిగౌరారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శాలిగౌరారం మండల అధ్యక్షుడిగా అంబారిపేట గ్రామానికి చెందిన తోట వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానన్నారు.

గోపలాయపల్లిలో వైభవంగా సుదర్శన హోమం


సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న యాజ్ఞికులు

నార్కట్‌పల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో హరిహర క్షేత్రంగా వెలుగొందుతున్న గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంపై శనివా రం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన రోహిణి తిథి రోజున లోక కల్యాణం కాంక్షిస్తూ ప్రతీ నెలా హోమాన్ని నిర్వహిస్తున్నారు. హోమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కా ర్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు, శ్రవణ్‌కుమార్, అరవిందరాయుడు, దేవేందర్‌గౌడ్, ఉపేందర్‌రావు, కృష్ణ, శరత్‌చంద్ర, సత్తయ్య, నవీన్‌చంద్ర, నరసింహ, సంతోష్, రామనాథం దంపతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గట్టుప్పల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కంచుకట్ల సంపత్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా గట్టుప్పల్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానవ సంబంధాలు వృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో మాదగోని వెంకట్‌గౌడ్, నాయకులు బీమగాని మల్లేష్, మాదగాని ఆంజనేయులు, నవపురం మాజీసర్పంచ్ భీమనపల్లి రాములు, గణేష్, గోపి, గిరి, మహేష్, అంజి, మహేష్, అఖిల్ పాల్గొన్నారు.

గురుకులలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నార్కట్‌పల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర) నకిరేకల్ ప్రిన్సిపాల్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతితో పాటు 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కులం, ఆదాయం, ఆధార్, ఫొటో, జనన ధ్రువీకరణ పత్రం జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సుకన్య

నకిరేకల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా గాజుల సుకన్య శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆల్‌ఇండియా మహిళా కాంగ్రెస్ ఆదేశానుసారం గాజుల సుకన్యశ్రీనివాస్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎంపిక చే శారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే వేముల వీరేశం ఆమెకు శుభాకాంక్ష లు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ముగ్గులతో వెలుగులోకి సృజనాత్మకత


బహుమతులు ప్రదానం చేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లేష్

నల్లగొండ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముగ్గుల పోటీలతో మహిళల్లో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మల్లేష్ అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శివాజీనగరలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. డీవైఎఫ్ఐ అందరికీ విద్య ఉపాధి కల్పించాలని పోరాటాలు నిర్వహిస్తూనే పలు రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన సభలో ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని అన్నారు. హామీల అమలుకోసం యువతను ఏకం చేయనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో 100మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గుండాల నరేష్, బాతుక సత్తయ్య, కౌన్సిలర్ వేదశ్రీ శ్రీనివాస్, మహష్, మాజీ కౌన్సిలర్ ఎండి.సలీం, నాయకులు దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కోట్ల అశోక్‌రెడ్డి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి మహిళలకు ముగ్గుల పోటీ

నకిరేకల్: నకిరేకల్ పట్టణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 60 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘం నకిరేకల్ అధ్యక్షుడు పొట్టబత్తుల పార్థసారధి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మూడుదుడ్ల కృష్ణమూర్తి, పెండెం రాములు, గోలి పద్మ, రాపోలు రవి, సిరిపురం శ్రీనివాస్, ఎనగందుల వెంకన్న, పి.సతీష్, కడేరు రవి, పావని, వెంకటరమణ, పిల్లలమర్రి శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పార్టీ బీమా భరోసా

మర్రిగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ప్రమాద బీమా భరోసాగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వల్లపు కొండల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతనికి మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కొండల్ భార్యకు అందజేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, జిల్లా నాయకులు రామిడి వెంకటరమణారెడ్డి, నాయకులు చెరుకు లింగంగౌడ్, ఉరిపక్క నగేష్, లక్ష్మీనరసింహ, మాదవరెడ్డి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నాంపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన ఊరుపక్క మల్లమ్మ, బుషిపాక కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున అందజేశారు.

ఘనంగా కూడార్రై ఉత్సవం

- ***గంగాళాల్లో పాయసంతో స్వామి, అమ్మవార్లకు నివేదన***


స్వామివారికి 108 గంగాళాలతో పాయసాన్ని నైవేద్యంగా నివేదిస్తున్న అర్చకస్వాములు

నల్లగొండ కల్చరల్, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు వైష్ణవ ఆలయాల్లో శనివారం ఉదయం కూడార్రై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గోదాదేవి రచించిన 27వ పాశురాన్ని ప్రవచనం పూర్తయిన సం దర్భంగా పండితులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలకంరించి 108 గంగాళాల పాయసంతో నివేదన చేశారు. అర్చక స్వాముల మంత్రోచ్చారణల మధ్యవేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై గోదా రంగనాయక స్వామిలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో సందడి చేశాయి. అనంతరం పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నల్లగొండ పట్టణంలోని రామగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో కూడార్రై ఉత్సవం కన్నుల పండువగా సాగింది. శ్రీమాన్ భాష్య జగన్నాధచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీచైర్మన్ బుర్రి చైతన్య, చకిలం సంధ్యారాణి, ఈవో జయరామయ్య, వికాసతరంగిణి సభ్యులు, మహిళా భక్తులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. అదేవిధంగా వీటీకాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడార్రై ఉత్సవం చూడముచ్చటగా సాగింది. కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ రావిరాల వెంకటేశ్వర్లు పూజిత, నూకల జయపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, మేడం ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తులసీనగర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం, షేర్‌బంగ్లాలోని సంతోషిమాత దేవాలయం, బీట్ మార్కెట్ శ్రీరామకోటి స్థూప దేవాలయం, పానగల్లు శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో కూడార్రై ఉత్సవం వేడుకలను అర్చకలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని భక్తితో పూజించారు.


నార్కట్‌పల్లిలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు


నల్లగొండలో నిర్వహించిన కూడార్రై ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

శాలిగౌరారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడార్రై ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, శేషం జగన్మోహనాచార్యులు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, తల్లిదండ్రులు చామల అరుణ వాసుదేవారెడ్డి, చాడ హతీష్ రెడ్డి, గోదల ప్రశాంతివెంకట్‌రెడ్డి దంపతులు, చామల ఉర్మిళ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కారంపూడి వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భక్తులు దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేష్, దోసపాటి విష్ణు, వేణు, బెల్లి దశరథ, పసునూరి పాండురంగయ్య, బిళ్లకంటి శ్రీకాంత్, కొప్పు నర్సింహ, స్రవంతి, సబిత, పద్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల మండలం నేరడలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమన్నారాయణుడికి మహిళలు హారతులు పట్టారు. శ్రీగోదాదేవి రచించిన తిరుప్పావై ద్రావిడ ప్రబంధమును భక్తులు భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పాపనీజనార్ధన్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


చిట్యాల: ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, కట్టంగూరు, నకిరేకల్, జనవరి 11, (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనీ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. శనివారం చిట్యాలలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. మహిళా చైతన్యంతోనే సమాజం బాగుపడుతుందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి రైతుభరోసా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిఆపరు. ఆర్థిక ఇబ్బందులున్నా ఆరు గ్యారెంటీల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 195 మంది లబ్ధిదారులకు రూ.68.26లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, పాటి మాధవరెడ్డి, కృష్ణ, వెంకటేశం, అయిలేష్, పరమేశం, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, కట్టంగూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి సాగర్, మాద లింగస్వామి, నాయకులు శ్రీను, అంజయ్య, వెంకన్న, కేశవులు, లింగస్వామి, గిరి, రెడ్డిపల్లి స్వామి, నకిరేకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులమాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, నకిరేకంటి యేసుపాదం, కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మునుగోడు, నాంపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీపీసీసీ రాష్ట్ర పధ్రాన కార్యదర్శి, పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు పున్న కైలాష్‌నేత, చేనేత కార్మిక సంఘం నాయకులు అన్నారు. నేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేనేత అభయహస్తం పథకంతో పాటు నేతన్న పొదుపు నిధి, నేతన్న భద్రత, నేతన్న భరోసాలకు ఆమోదం ప్రకటించి వేర్వేరుగా నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మునుగోడు, నాంపల్లి మండల కేంద్రాల్లో శనివారం చేనేత, పద్మశాలీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో అఖిల భారత పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు అవ్వారు భాస్కర్‌నేత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, నాయకులు గంజి బిక్షం, సంగిశెట్టి పరమేశ, అల్వాల వెంకయ్య, కుమార్, జగన్నాదం, నరేందర్, పరమేష్, మారయ్య, నాంపల్లిలో సంగేపు గణేష్, పిల్లలమర్రి రంగయ్య, గుర్రం భిక్షమయ్య, శ్రీరాములు, భరతయ్య పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- ***మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి***


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సే తమ లక్ష్యమని నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కార్మికులకు దుస్తులు, చెప్పులు, కొబ్బరినూనె వంటి సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కార్మికులకు రావాల్సిన 9 నెలల ఏరియర్స్, బకాయిలను వెంటనే ఇస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా మునిసిపాలిటీకి మరో 11 నూతన వాహనాలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైష్ణవిదేవి అలంకరణలో ఎల్లమ్మ

కనగల్, జనవరి 11: కనగల్ మండలం దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శనివారం వైష్ణవిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకస్వాములు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి అఖండ హారతులిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి అమ్మవారికి చీరసారె ఒడిబియ్యం బోననైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉంటే ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది భక్తుల రద్దీకి అనుగుణంగా తగు ఏర్పాట్లు చేశారు.

సుపారీ కిల్లర్ బెయిల్ కోసం నకిలీ ష్యూరిటీ పత్రాలు

- ***సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో ట్విస్ట్***
- ***చీటింగ్, ఫోర్జరీ కేసుల్లో జామీనుదారుల అరెస్ట్***


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ కె.వీరబాబు

మిర్యాలగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసు ఘటన మరోసారి చర్చనీయాంశమైంది. బీహార్‌కు చెందిన సుపారీ కిల్లర్ సుభాష్ శర్మకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా జామీనుదారులు నకిలీ ష్యూరిటీ పత్రాలు దాఖలుచేసి కటకటాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు వివరించారు. మిర్యాలగూడకు చెందిన మారుతీరావు కుమార్తె అమృతను కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న ప్రణయ్ 2018 సెప్టెంబరు 14వ తేదీన హత్యకు గురయ్యాడు. ప్రణయ్ మామ మారుతీరావు సుభాష్‌శర్మ అనే బీహారీ సుపారీ కిల్లర్‌తో ప్రణయ్‌ను చంపించాడని, వా రికి సహకరించిన అస్గర్‌అలీ, అబ్దుల్‌బారీ, ఎంఏ కరీం, శ్రవణ్‌కుమార్, మారుతీరావు కారు డ్రైవర్ శివతో కలిసి ఏడుగురిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్యకేసు కింద అరెస్టుచేసి జైలుకు పంపారు. ఏ2 సుభాష్‌శర్మ మినహా మిగతా వారందరికి 2019లో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కేసులో ఏ1గా ఉన్న మారుతీరావు 2020 మార్చి 7వ తేదీన ఆత్మహత్య చేసుకోగా, ఏ7గా ఉన్న మారుతీరావు కారు డ్రైవర్ శివ పేరును విచారణ అనంతరం పోలీసులు చార్జిషీట్ నుంచి తొలగించారు. మిగతావారు బయటనుంచి కోర్టు విచారణను ఎదుర్కొంటున్నారు. సుభాష్‌శర్మకు గతంలో రెండుసార్లు బెయిల్ రాగా, అతను బయటకు వస్తే విచారణకు ఆటంకం కలుగుతుందని భావించిన పోలీసులు బెయిల్ క్యాన్సిల్ చేయించి సుభాష్‌శర్మను అండర్‌ట్రయల్ ఖైదీగా జైల్లోనే ఉంచారు. సుభాష్‌శర్మ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించడంతో 2024 నవంబరు నెలలో బెయిల్ మంజూరు చేసి ముగ్గురిని జామీను ఇవ్వాలని సూచించింది. సుభాష్‌శర్మకు విడుదలకు ష్యూరిటీల కోసం చూస్తున్నారని నిందితుడి తరుపున న్యాయవాది ద్వారా తెలుసుకున్న కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన వంగాల సైదులు, మాడ్గులపల్లి మండలం పాములపాడు చింతచర్ల దేవయ్య, అదే గ్రామానికి చెందిన ముక్కాముల మల్లేష్‌లు నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టులో జామీను పత్రాలు ఇచ్చారు. ష్యూరిటీలపై వెరిఫికేషన్ చేయమని కోర్టు పోలీసులను ఆదేశించడంతో ష్యూరిటీ పత్రాలు ఫోర్జరీ చేసినట్లు దర్యాప్తులో తేలింది.

నకిలీ స్టాంపులు తయారు చేయించి

వంగాల సైదులు మిగతా ఇద్దరు దేవయ్య, మల్లేష్‌లతో కలిసి సూర్యాపేటలో ఖాళీ ష్యూరిటీ పత్రాలు కొని పాములపాడు గ్రామపంచాయితీ కార్యాలయ ముద్రలను తయారు చేయించి నకిలీ పత్రాలు (వాల్యూ సర్టిఫికెట్) నల్లగొండ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించారు. దీనిపై పాములపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి భారత న్యాయ సంహిత సెక్షన్ 61(2), 318(4), 336(3), 304(2) కింద శనివారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. చీటింగ్‌కు పాల్పడిన ముగ్గురు జామీనుదారులను అరెస్ట్ చేసి వారి వద్ద రెండు స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్, యాక్టివా స్కూటీ, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసు దర్యా ప్తు చేసి నిందితులు పట్టుబడేలా చేసిన రూరల్ సీఐ కె.వీరబాబు, మాడ్గులపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అభినందించారు.

వంగాల సైదులుపై 21 కేసులు

ప్రణయ్ హత్యకేసులో నిందితుడైన సుభాష్‌శర్మకు నకిలీ ష్యూరిటీ పత్రా లు కోర్టుకు అందజేసిన కేసులో ఏ1గా ఉన్న వంగాల సైదులు గతంలో జిల్లా లో వేర్వేరు మండలాల్లో జరిగిన 21 దొంగతనాల కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 । కనిష్ఠం 16.0

బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బీజేపీ కులమతాల విభజనకు పాల్పడుతూ చిచ్చు పెడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంలో ఆనాడే ఆదివాసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 46 నిబంధనను తీసుకువచ్చిందన్నారు. ఆదివాసీలను తీర్చిదిద్దే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని, ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అలాగే గుజరాత్ నుంచి మణిపూర్ వరకు రాహుల్‌గాంధీ చేసిన భారత్ జోడోయాత్ర ఎందరో అభాగ్యులకు గొంతుకగా నిలిచిందన్నారు. దేశంలో 11 రాష్ట్రాల్లో 20వేల మంది ఆదివాసీలను నాయకులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం

- మిగతా 6వ పేజీలో...

సబ్‌ప్లాన్ చట్టం సర్వరోగ నివారిణి



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, చిత్రంలో రోడ్లు, భవనాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- ఆదివాసీలకు ప్రకృతే దైవం, దేహం
- కాంగ్రెస్ శ్రేణులు ధైర్యంగా సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నాగార్జునసాగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం సర్వరోగ నివారిణి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రాజెక్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్న అఖిలభారత గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల సాధికారత శిక్షణ తరగతుల ముగింపు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలను అందజేసే కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏలను పునరుద్ధరించడం, వాటికి బడ్జెట్‌ను కేటాయించి, నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామాల్లో ధైర్యంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. దేశ సంపద ప్రజలకు దామాషా ప్రకారం అందాలి తప్ప కార్పొరేట్ శక్తులకు కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీన పరచాలని చూస్తుంటే కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని రక్షించేందుకు నడుంబిగించారని అన్నారు. సంవిధాన్ సమ్మేళన్ పేరిట ఆయన దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పీసా చట్టాన్ని నూరుశాతం అమలుచేస్తామన్నారు. ఆదివాసీలు భూమిని తల్లిగా, నదులను రక్తమాంసాలుగా భావిస్తారని, వాటిని దూరం చేస్తే వారు ప్రాణం లేని శవాలుగా మారుతారన్నారు. ఆదివాసీలపై ప్రేమలేని వారు వారి నుంచి వాటిని

- మిగతా 6వ పేజీలో..

తండాలతో నాకు ఎక్కువ అనుబంధం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



తండాలతో తనకు ఎక్కువ అనుబంధం ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వరకు సామాజిక న్యాయం ఒక్కటే కాంగ్రెస్ ఎజెండా అన్నారు. దళితులు, బీసీలు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందిస్తామన్నారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి వెంకట్‌రెడ్డి సహకారంతో ప్రతి తండాలో ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి భవనాలను నిర్మిస్తామన్నారు. అణగారిన వర్గాలను అభివృద్ధి చేయాలన్నదే రాహుల్‌గాంధీ ఉద్దేశమన్నారు. అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని జోస్యం చెప్పారు. దేశంలో ఎక్కడాలేని..

- మిగతా 6వ పేజీలో...

డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్


- నేటి కేటీఆర్ మహాధర్నా వాయిదా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు

నల్లగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శనివారం జిల్లాకేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుభరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి, రూ.12వేలకు తగ్గించారని, రుణమాఫీ సగం మంది రైతులకు మాత్రమే చేశారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై ఈ నెల 12న కేటీఆర్ అధ్యక్షతన తలపెట్టిన రైతు మహాధర్నాను సంక్రాంతి పండుగ, రహదారుల రద్దీ దృష్ట్యా వాయిదా వేశామని, పండుగ తర్వాత ఈ మహాధర్నాను యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేటీఆర్‌పై ఈ-ఫార్ములా పేరుతో కేసులు పెట్టారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యేలను భయభ్రాంతులకు గురిచేసి కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి జైలుకు పోయారు కాబట్టే, కేటీఆర్‌ను జైలుకు పంపాలన్న కుట్రతో కేసులు పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, నాయకులు నిరంజన్ వలీ, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సింగం రాంమోహన్, కరీంపాషా, భువనగిరి దేవేందర్, అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సామాన్యులపై ధరాఘాతం



సంక్రాంతి పండుగ పూట కడుపు నిండా తినేపరిస్థితి లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు పండగను సంతోషంగా జరుపుకుందామంటే పెరిగిన నిత్యావసర ధరలతో బెంబెలెత్తిపోతున్నారు. ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ చేయక పోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని వస్తువులనైతే బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. దీంతో వ్యాపారులు చెప్పిందే రేటు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. హోల్‌సేల్ రిటైల్ అనే తేడా లేకుండా ప్రతి వస్తువుపైనా అధిక ధరలు వసూలు చేస్తున్నారు. సామాన్యుడు ఇది ఏమిటని అడిగే పరిస్థితి కానరావడం లేదు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ, సూర్యాపేట టౌన్)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో మండిపోతున్న ధరలను చూసి సామాన్యులు విలవిల లాడుతున్నారు. కూరగాయల ధరలను పరిశీలిస్తే చిక్కుడు కాయ, బెండకాయ కిలోకు రూ.100కు చేరుకోగా, దొండ కాయ, గోకరకాయ కిలోకు రూ.80 వెచ్చించాల్సి వస్తుంది. ఇక మునగకాయ అయితే కిలోకు రూ.160చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఎల్లిగడ్డ కిలో రూ.300, ఎండుమిర్చి కిలో రూ.170, కందిపప్పు కిలో రూ.150 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో బెల్లం నిల్వలు సరిపడా లేవు. బెల్లం ధర ప్రస్తుతానికి నిలకడగానే ఉంది.

- ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదు!
- సంక్రాంతివేళ ఆకాశాన్నంటిన ధరలు
- మండిపోతున్న కూరగాయలు, నిత్యావసర సరుకులు
- ధరలపై ప్రభుత్వ నియంత్రణ కరువు

ఇతర ప్రాంతాల నుంచి సరుకుల దిగుమతితో..



ఇతర రాష్ట్రాలు, పక్క జిల్లాల నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు కూడా వస్తువులపై పడుతున్నట్లు సమాచారం. కూరగాయలు కర్నూల్, అనంతపురంతోపాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి వస్తుండగా నిత్యావసర వస్తువులు మాత్రం గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చేరుస్తారు. రాష్ట్ర రాజధాని సరిహద్దులో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కూరగాయల సాగు చేపట్టి ధరలు నియంత్రిస్తామని గత ప్రభుత్వం స్పష్టం చేసి ఉద్యానశాఖను అప్రమత్తం చేసింది. అయితే గత ప్రభుత్వ..

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వంనుంచి అదనపు రేషన్ లేనట్లే..

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు తొమ్మిది రకాల సరుకులతో కూడిన నిత్యావసర వస్తువులు, రేషన్ ఇచ్చే వారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ 11ఏళ్ల కాలంలో ప్రతినెలా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న సబ్సిడీ దొడ్డు బియ్యాన్ని సరఫరా చేయడం తప్ప ఎలాంటి అదనపు సరుకులు ఇవ్వడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో బెల్లం, చింతపండు, పప్పు, నూనె, గోధుమపిండి, చక్కెర, ఇంకా ఇతర మరో మూడు సరుకులను ఇచ్చేవారు. ప్రస్తుతం బియ్యం తప్ప అది కూడా ఒక్కో మనిషికి ఆరుకిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. సంక్రాంతి నుంచి రేషన్ షాపుల నుంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామన్నా ప్రభుత్వం మరోసారి వాయిదావేసింది. కనీసం పేద, మధ్యతరగతి ప్రజలు తెల్లరేషన్‌కార్డు ద్వారా పొందే బియ్యాన్ని కూడా అధికంగా ఇవ్వని పరిస్థితులున్నాయి. సంక్రాంతి నుంచి సన్నబియ్యం వస్తాయని ప్రజలు ఎంతో ఆశపడినప్పటికీ మరోసారి నిరాశ, నిస్పృహలు తప్పలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రతి నెలా 13 నుంచి 14వేల క్వింటాళ్లకు పైగా దొడ్డు బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. చాలా చోట్ల రేషన్ షాపు డీలర్లు తమ షాపుల్లో వ్యాపారుల నుంచి కొనుగోలు చేసుకొని వచ్చిన కొన్ని నిత్యావసర వస్తువులను మార్కెట్‌లో ఉన్న రేట్లకే విక్రయిస్తుంటారు. ముఖ్యంగా నూనెతోపాటు గోధుమపిండి, సబ్బులను విక్రయిస్తున్నారు. వాస్తవానికయితే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిత్యావసర సరుకులు రేషన్ షాపునుంచి రాకపోవడంతో కొనుగోలు చేయక తప్పడంలేదు.

పథకాల అమలుకు సంసిద్ధం కావాలి



కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు అధికారులు సంసిద్ధం కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం కలెక్టర్‌లో నూతన పథకాల సంసిద్ధత, కార్యాచరణ ప్రణాళిక, పథకం ముఖ్య ఉద్దేశాలు, విధివిధానాలు, తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులతో హైదరాబాద్‌లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఆయా పథకాల అమలుపై నిర్దేశించిన ఆదేశాలను కలెక్టర్ అధికారులకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న పథకాల్లో రైతు భరోసా కింద వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే ప్రతీ సంవత్సరం ఎకరాకు రూ.12వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా విడతకు రూ.6వేల చొప్పున సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్నారు. గ్రామ, మునిసిపల్, పట్టణస్థాయిలో నూతన రేషన్ కార్డులు ఇస్తామన్నారు. గ్రామీణస్థాయిలో ఎంపీడీవోలు, పట్టణస్థాయిలో మునిసిపల్ కమిషనర్లకు ఈ బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. వన్ స్టేట్ వన్ రేషన్‌కార్డు పద్ధతిలో వీటిని పంపిణీ చేయనున్నట్లు వివరించారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక రేషన్ కార్డులో మాత్రమే ఉండేలా ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇంటి నిర్మాణానికి స్థలం ఉండి ఇల్లు లేని వారు, దారిద్ర్య రేఖకు దిగువానున్న వారు, అద్దె ఇళ్లలో నివాసం ఉండేవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో వితంతువులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ పథకాల అమలుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 12న ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారులతో ఉదయాదిత్య భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జేడీ శ్రవణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మునుగోడులో..

8

నేతన్నల భద్రత, భరోసా పథకాలను వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫ్లెక్సీలకు శనివారం జిల్లావ్యాప్తంగా క్షీరాభిషేకం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా పనులు చేపట్టాలి

పుట్టంగండి పంప్‌హౌస్‌ను పరిశీలించిన జలమండలి అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటి సమస్య లేకుండా పుట్టంగండి మరమ్మతు పనులు చేపట్టాలని జలమండలి అధికారులు సూచించారు. పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పుట్టంగండి పంప్‌హౌస్, సిస్టర్న్, హెడ్‌రెగ్యులేటర్, లింక్‌కెనాల్, ఏకేబీఆర్, కోదండపురం వాటర్‌ప్లాంట్‌ను శనివారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ తన బృందంతో కలిసి పరిశీలించారు. ముందుగా పుట్టంగండి పంప్‌హౌస్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌కు వచ్చే 9.26 కిలోమీటర్ల లింక్‌కెనాల్ శాశ్వత లైనింగ్ పనులు చేపడితే జంటనగరాలకు, మిషన్‌భగీరథకు తాగునీటి సమస్య ఏర్పడుతుందా? అనే అంశాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. పుట్టంగండి పంప్‌హౌస్ మోటర్లు బంద్ చేస్తే జంటనగరాలకు నీటి సమస్య ఏర్పకుండా పైప్‌లైన్ ద్వారా అక్కంపల్లి రిజర్వాయర్ నీటి తరలింపు, రైతులనుంచి ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట జలమండలి డైరెక్టర్ సుదర్శన్, ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రయ్.. రయ్..



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

ఒక్కొక్కటి.. వందలాదిగా.. వేలాదిగా మారి రయ్.. రయ్..మంటూ పరుగులు పెట్టాయి. సంక్రాంతి పండుగకు సెలవులు ప్రకటించడంతో పట్టణం పల్లెకు పయనమైంది. పిల్లాపాపలతో సొంత వాహనాలు, బస్సుల్లో బయలుదేరిన ప్రయాణికులతో జిల్లాలోని జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర రహదారులు రద్దీగా మారాయి. వాహనాల రాకతో టోల్‌ప్లాజాల సందడిగా మారాయి.

6

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

కొండమల్లేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం యువత పనిచేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు సామల అఖిల్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా శనివారం కొండమల్లేపల్లిలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారొద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు మౌనేశ్వర్‌చారి, శ్రీకాంత్, కార్తీక్, హేమసుందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల్

ఆటస్థలమేదీ?

● ఆదర్శ పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

నేరేడుగొమ్ము, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆట స్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేసి చుట్టూ కంచె వేశారు. దీంతో విద్యార్థులు ఆటస్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నామని వాపోతున్నారు. పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు 420 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి క్రీడా ప్రాంగణం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆదర్శ పాఠశాల నుంచి గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభకనబర్చారు. క్రీడా మైదానం లేకపోవడంతో క్రీడలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పల్లె ప్రకృతి వనంలో చెట్లు ఏపుగా పెరిగి క్రిమికీటకాలు, పాములు పాఠశాలలోకి వస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



నేరేడుగొమ్ము ఆదర్శ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం

క్రీడా స్థలంలేక ఇబ్బందులు



క్రీడా స్థలం లేకపోవడంతో ఆటలకు దూరమవుతున్నాం. క్రీడలపై ఆసక్తి ఉన్నా మైదానం లేక ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాల ఆవరణలో ఉన్న స్థలం పల్లె ప్రకృతి వనానికి కేటాయించారు. పల్లె ప్రకృతివనం తొలగించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి.

- బుడిగపాక సన్ని, ఇంటర్ విద్యార్థి

పాఠశాలలోకి క్రిమికీటకాలు



పాఠశాల ఎదుట ఉన్న పల్లె ప్రకృతివనం నుంచి విష పురుగులు, క్రిమికీటకాలు పాఠశాలలోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నాం. పల్లె ప్రకృతివనం చుట్టూ ప్రహరిగోడ ఏర్పాటు చేసి క్రీడా స్థలం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

- శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జింక్ లోపం రాకుండా చూడాలి

హుజూర్‌నగర్ ఏవో స్వర్ణ



ప్రభుత్వ ఆసుపత్రిలో పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని గుడిపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ యేరేడ్ల ప్రియాంక తెలిపారు. శనివారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(పెద్దఅడిశర్లపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ ఆసుపత్రిలో పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు ఉన్నాయా?

డాక్టర్: పాము, కుక్కకాటుకు గురైన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నాం. పాము కాటుకు యాంటి స్నేక్ సీరమ్, కుక్కకాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి.

డాక్టర్: డెంగ్యూ జ్వరం ఏడీస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి అధికంగా మోకాళ్ల, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరంతో బాధపడుతుంటారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మరల వస్తుంది.

ఆంధ్రజ్యోతి: రోగాల బారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.

డాక్టర్: ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. భోజనానికి ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలి. కాచి చల్లార్చిన నీటినే వాడాలి. వేడి వేడి పదార్థాలను భుజించాలి.

దేవరకొండలో సంక్రాంతి సంబరాలు

● ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు, ప్రదర్శనలు

దేవరకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని శనివారం వాసవీ క్లబ్, వాసవీవనితాక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి లెండాలే వీనా, రెండవ బహుమతి వీరమళ్ల ఉమాదేవి, మూడవ బహుమతి శ్రీదేవిలకు వాసవీక్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి అందజేశారు. దేవరకొండ రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు పాఠశాలల చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మి, రామకృష్ణ బహుమతులు అందజేశారు.

మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి


వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కి వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): నూతన మండలంగా ఏర్పడిన గుడిపల్లిలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని గుడిపల్లి మండల డైరెక్టర్ భూతం సైదులు కోరారు. దేవరకొండలో శనివారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సమావేశానికి ఆయన హాజరై నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునమాధవరెడ్డికి సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మండలంలో కార్యాలయాలు లేకపోవడంతో పాత మండలం పీఏపల్లికి వెళ్లాల్సి వస్తుందన్నారు. గుడిపల్లి మండలంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి సులువుగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ తగుళ్ల సర్వయ్య, చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, మార్కెట్ కార్యదర్శి కిరణ్, కమిటీ డైరెక్టర్లు, మేకల దీపవెంకటయ్య, గుండెబోయిన రాములు, దేప సుదర్శన్‌రెడ్డి, పెద్దిశెట్టి సుధాకర్, నేనావత్ కేశ్యానాయక్, మాదవరం గోవర్ధన్‌రావు, దస్తగిరి పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగ సంఘం

నియోజకవర్గ అధ్యక్షుడిగా గోపీనాథ్

దేవరకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్ నాలుగో తరగతి ఉద్యోగ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆర్.గోపీనాథ్ ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ కమిటీని ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి తెలంగాణ నాలుగో తరగతి జిల్లా కార్యదర్శి మేడి మణికుమార్, జిల్లా అధ్యక్షుడు బిక్షమయ్య తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆర్.గోపీనాథ్, ఉపాధ్యక్షులుగా సైదమ్మ, బాలమ్మ, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి గౌస్, ప్రచార కార్యదర్శి మల్లేష్, సంయుక్త కార్యదర్శిగా నిరంజన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ సీహెచ్.సైదులు తదితరులు పాల్గొన్నారు.

14 రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేయాలి


ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరిస్తున్న ప్రభావతి

కొండమల్లేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు తీసుకురావడం వల్ల పేదలపై అధిక భారం పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా రాష్ట్ర కమిటి సభ్యురాలు పద్మ, మనీష, మంజుల, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం పెంచుకోవాలి

హాలియా, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు రంగవల్లులు, వంటింటికే పరిమితం కాకుండా రాజకీయ చైతన్యం కూడా పెంపొందించుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి పిలుపునిచ్చారు. హాలియాలో పదో వార్డులో ఐద్వా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు మహిళలపై చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతోందని, మద్యానికి బానిసైన కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బెల్ట్ షాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలెబోయిన వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కారంపూడి ధనమ్మ, నాయకులు రెవెల్లి వెంకటేశ్వర్లు, పొదిల వెంకన్న, జటావత్ రవినాయక్, బందిలి సైదులు, సంతోష్, పష్పలత, జిల్లా సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్సీ


చందంపేట: చిత్రియాలలో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జాలె నర్సింహారెడ్డి

తిరుమలగిరి(సాగర్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు శరీర దృఢత్వానికి దోహదపడతాయని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బట్టువెంకన్నబావితండా, సపావత్‌తండాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా గణేష్‌యూత్ ఆధ్వర్యంలో, మెరావత్ మునినాయక్ నిర్వహణలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్సీ కోటిరెడ్డి శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యమైన సమాజం క్రీడా మైదానం నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. క్రీడలతో గ్రామాల మధ్య స్నేహసంబంధాలు మెరుగవుతాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బివి.రమణరాజు, నాయకులు తేరా రాఘవరెడ్డి, జటావత్ శ్రవణ్‌కుమార్, ప్రకాశ్‌నాయక్, కిశోర్‌నాయక్, బీఆర్.యాదవ్, కోటేష్‌యాదవ్, నాగార్జున, వెంకన్న, వెంకట్రావు, మేఘూ, లాల్‌సింగ్, రవి, రంగా, సంతోష్, లచ్చిరాం, చందునాయక్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, కాంగ్రెస్ నాయకుడు బొల్లు గోవింద్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద యాదవ్స్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి మండల స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. గెలుపు, ఓటమితో సంబంధం లేకుండా స్నేహపూర్వకంగా పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు సూచించారు. అనంతరం ఎస్ఐ బ్యాటింగ్ చేసి క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమంలో వీరమళ్ల సతీష్‌కుమార్, లోకేష్, డీలర్ శ్రీనునాయక్, అచ్యుత్‌కుమార్, బొల్లు సతీష్, నీలం సైదులు,సన్నీ, గిరి పాల్గొన్నారు.

● చందంపేట మండలం చిత్రియాలలో జాలె అండాలమ్మ వెంకట్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను పీఏసీఎస్ చైర్మన్, పీసీసీ సభ్యుడు జాల నర్సింహారెడ్డి ప్రారంభించారు. యువకులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహన్, సీపీఐ మండల కార్యదర్శి వెంకటయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బందెల వెంకటయ్య, జేపీఆర్ ఇన్‌ఫ్రా ఎండీ జాలె తిలక్‌రెడ్డి, నాయకులు అంకులు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

● గోవింద నామస్మరణతో మార్మోగిన శ్రీవారి ఆలయం

చింతపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్ కొండపై నెలకొన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్షేణ పూజ, వైష్ణవ ఆచార సంప్రదాయం ప్రకారం అలువేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రాకతో ఒక్కసారిగా ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, గోపాలస్వామి ఆలయ చైర్మన్ అంగిరేకుల గోపాల్, అర్చకులు మొకిరాల శ్రీకాంత్‌శర్మ, పాండు, ధర్మకర్తలు మద్దెల కృష్ణగౌడ్, గడ్డం ఆంజనేయులు, కోడిదూటి జంగయ్య, చేపూరి నారాయణచారి పాల్గొన్నారు.


చింతపల్లి: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కూడారై ఉత్సవంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు

ముగిసిన సుదర్శన హోమం

హాలియా: లోక కల్యాణార్థం హోమం నిర్వహించినట్లు గోవర్ధన రాఘవాచార్యులు తెలిపారు. హాలియా మునిసిపాలిటీలోని సాయిప్రతాప్‌నగర్‌లోని స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 27 రోజులుగా నిర్వహిస్తున్న అష్టాక్షర సైదా సుదర్శన నర్సింహ హోమం మహాపూర్ణాహుతితో ముగిసింది. అనంతరం ధనుర్మాస ఉత్సవంలో భాగంగా కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, పీత వెంకటేశ్వరరాజు, పద్మజ దంపతులు, కంచర్ల గురువారెడ్డి, మనాది రవీందర్, దేవరకొండ సైదులు, అరుణ, మహాలక్ష్మి, స్వాతి, సరిత, జ్యోతి, శేషు, కుమారి, శ్రీ చరణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి హేయం

దేవరకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడటం, ఫర్నీచర్ ధ్వంసం చేయడం సరైన విధానం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ నేతలపై దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

దేవరకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ డిమాండ్ చేశారు. దేవరకొండలో వడ్డెర ఒబన్న జయంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ఆయన కోరారు. వడ్డెరులందరూ ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇరగదిండ్ల వెంకటేష్, కార్యదర్శి వేముల వెంకట్రాములు, గండికోట వెంకటయ్య, ఇరగదిండ్ల సైదులు, బిక్షపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలను కొనసాగించాలి


మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నియోజకవర్గంలో రాజవరం, పేరూరు, సూరేపల్లి మేజర్ల కింద ముమ్మురంగా వరినాట్లు కొనసాగుతున్నాయని నీటి విడుదల కొనసాగించాలని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం సాగర్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా వారి సూచన మేరకు డ్యాం ఎస్ఈకి వినతిపత్రం సమర్పించారు. వినతిలో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వారబందీలో భాగంగా నీటి నిలిపివేత ఉందని, ఆయా మేజర్ల పరిధిలో ముమ్మరంగా వరినాట్లు కొనసాగుతున్నందున నీటి విడుదల నిలిపివేస్తే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకా నాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా మొదటి సారి వారబందీ లేకుండా చేయాలని కోరారు. దానికి వారు సానుకూలంగా స్పందించినట్లు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట వైస్‌చైర్మన్ కలసాని చంద్రశేఖర్, నాయకులు గౌని రాజారమేష్‌యాదవ్, కోట నాగిరెడ్డి ఉన్నారు.

విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : ఎస్ఎఫ్ఐ

మిర్యాలగూడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ విమర్శించారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.8700 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. గురుకులాల్లో నాన్ టీచింగ్ కుకింగ్ ఫ్యాకల్టీని పూర్తిగా నింపకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గురుకులాలకు, సంక్షేమ హాస్టళ్లకు, కస్తూర్బాగాంధీ పాఠశాలలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి వసతిగృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ఉపాధ్యక్షులు సైదానాయక్, లక్ష్మణ్, వెంకటేష్, రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు జగదీష్, వీరన్న, పుష్పలత, త్రిష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

సుపారీ కిల్లర్ బెయిల్ కోసం నకిలీ ష్యూరిటీ పత్రాలు

● సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో ట్విస్ట్

● చీటింగ్, ఫోర్జరీ కేసుల్లో జామీనుదారుల అరెస్ట్

మిర్యాలగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసు ఘటన మరోసారి చర్చనీయాంశమైంది. బీహార్‌కు చెందిన సుపారీ కిల్లర్ సుభాష్‌శర్మకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా జామీనుదారులు నకిలీ ష్యూరిటీ పత్రాలు దాఖలుచేసి కటకటాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరించారు. మిర్యాలగూడకు చెందిన మారుతీరావు కుమార్తె అమృతను కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న ప్రణయ్ 2018 సెప్టెంబరు 14వ తేదీన హత్యకు గురయ్యాడు. ప్రణయ్ మామ మారుతీరావు సుభాష్‌శర్మ అనే బీహారీ సుపారీ కిల్లర్‌తో ప్రణయ్‌ను చంపించాడని, వారికి సహకరించిన అస్గర్‌అలీ, అబ్దుల్‌బారీ, ఎంఏ కరీం, శ్రవణ్‌కుమార్, మారుతీరావు కారు డ్రైవర్ శివతో కలిపి ఏడుగురిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసు కింద అరెస్టుచేసి జైలుకు పంపారు. ఏ2 సుభాష్‌శర్మ మినహా మిగతా వారందరికి 2019లో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కేసులో ఏ1గా ఉన్న మారుతీరావు 2020 మార్చి 7వ తేదీన ఆత్మహత్య చేసుకోగా, ఏ7గా ఉన్న మారుతీరావు కారుడ్రైవర్ శివ పేరును విచారణ అనంతరం పోలీసులు చార్జిషీట్ నుంచి తొలగించారు. మిగతావారు బయటనుంచి కోర్టు విచారణను ఎదుర్కొంటున్నారు. సుభాష్‌శర్మకు గతంలో రెండుసార్లు బెయిల్ రాగా, అతను బయటకు వస్తే విచారణకు ఆటంకం కలుగుతుందని భావించిన పోలీసులు బెయిల్ క్యాన్సిల్ చేయించి సుభాష్‌శర్మను అండర్‌ట్రయల్ ఖైదీగా జైల్లోనే ఉంచారు. సుభాష్‌శర్మ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించడంతో 2024 నవంబరు నెలలో బెయిల్ మంజూరు చేసి ముగ్గురిని జామీను ఇవ్వాలని సూచించింది. సుభాష్‌శర్మకు విడుదలకు ష్యూరిటీల కోసం చూస్తున్నారని నిందితుడి తరుపున న్యాయవాది ద్వారా తెలుసుకున్న కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన వంగాల సైదులు, మాడ్గులపల్లి మండలం పాములపాడు చింతచర్ల దేవయ్య, అదే గ్రామానికి చెందిన ముక్కాముల మల్లేష్‌లు నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టులో జామీను పత్రాలు ఇచ్చారు. ష్యూరిటీలపై వెరిఫికేషన్ చేయమని కోర్టు పోలీసులను ఆదేశించడంతో ష్యూరిటీ పత్రాలు ఫోర్జరీ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ కె.వీరబాబు

నకిలీ స్టాంపులు తయారు చేయించి

వంగాల సైదులు మిగతా ఇద్దరు దేవయ్య, మల్లేష్‌లతో కలిసి సూర్యాపేటలో ఖాళీ ష్యూరిటీ పత్రాలు కొని పాములపాడు గ్రామపంచాయితీ కార్యాలయ ముద్రలను తయారు చేయించి నకిలీ పత్రాలు (వాల్యూ సర్టిఫికెట్) నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించారు. దీనిపై పాములపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి భారత న్యాయ సంహిత సెక్షన్ 61(2), 318(4), 336(3), 304(2) కింద శనివారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. చీటింగ్‌కు పాల్పడిన ముగ్గురు జామీనుదారులను అరెస్ట్ చేసి వారి వద్ద రెండు స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్, యాక్టివా స్కూటీ, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసు దర్యాప్తు చేసి నిందితులు పట్టుబడేలా చేసిన రూరల్ సీఐ కె.వీరబాబు, మాడ్గులపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అభినందించారు.

వంగాల సైదులుపై 21 కేసులు

ప్రణయ్ హత్యకేసులో నిందితుడైన సుభాష్‌శర్మకు నకిలీ ష్యూరిటీ పత్రాలు కోర్టుకు అందజేసిన కేసులో ఏ1గా ఉన్న వంగాల సైదులు గతంలో జిల్లాలో వేర్వేరు మండలాల్లో జరిగిన 21 దొంగతనాల కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.